

ఆంధ్రదేశ మంతటా
సెప్టెంబరు 6 వ తేదీ
నుండి
భలే అమ్మాయిలు
రాజశ్రీ విడుదల
BHARAT STUDIO



ఆంధ్ర మహిళ

సంపుటి 13 : : సెప్టెంబర్ '57 : : సంచిక 9

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్

వి ష య సూ చి క

సంపుటి 13 :: సెప్టెంబరు '57 :: సంచిక 9

ఆరంభమైనది పండుగల సంరంభము

వరలక్ష్మీ వ్రతములతో ఆరంభమైంది మనకు పండుగల సంరంభము. మరి ఆరు నెలల వరకు మనకు చేతినిండా పండుగల పనులే వున్నవి. ఈసారి పండుగల హడావిడికి ఒక ప్రత్యేకత కూడా కలసివచ్చింది. మామూలు స్వాతంత్ర్య దినోత్సవములతో, శతవార్షిక స్వాతంత్ర్యోత్సవము ఈసారి దేశమంతా మన సోదర సోదరీ మణులు విజయానందములతో జరుపుకున్నారు. ఈ సమయమున ఇప్పటి పదిసంవత్సరముల స్వాతంత్ర్య సుఖానుభవమును సావధానముగా పర్యవలోకనము చేసికొనుటకు అవకాశము లభించింది.

చీకటి లేనిది వెలుతురులేదు. కష్టములేనిది సుఖములేదు. అట్లాగే మన స్వాతంత్ర్యానుభవమునకు కొన్ని కష్టములను ఎదుర్కొనక, అనుభవించక తప్పదు.

క్రిందటి మాసములో దేశమంతటా సమ్మెల అలజడి చెలరేగి ప్రజలకు చాలాభయాందోళనలు కలిగించినది. దేవుని దయవల్ల మన ప్రజలకు "సన్మతి" కలిగి మనకు ఇక్కట్లు లేకుండా చేశారు.

పిడుగుకీ బియ్యానికీ ఒకటే మంత్రము కుదరదు. స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి, అనుభవించడానికి రెండింటికి సమ్మెలు కుదరవు. బాధ్యతలు వహించిన తరువాత బాధ్యతా రహితంగా ప్రవర్తించటము మన అధోగతికి మనము త్రవ్వుకొనుటే.

మొన్న తపాలాసమ్మె బెదరింపు సమయములో పెక్కు పట్టణాలలో స్త్రీలు అట్టిసమ్మె సమయమున ప్రభుత్వమునకు, తద్వారా ప్రజలకు తపాలా బట్వాడాచేసి ఆదుకొనుటకు నిశ్చయించుకొన్నట్లు వార్తలు వచ్చినవి. తాము నిర్వర్తించగల అట్టి కార్యమందు సోదరీమణులు ముందంజవేసి, చేయూతనిచ్చి తమ సహకారమును చూపించినందులకు సంతసించకుండ ఎవ్వరుందురు? దేశములో ఎట్టి క్లిష్టసమస్యవచ్చినను మనస్త్రీలు ఎప్పుడు వెనుకాడిరి! నేడుమనము శతవర్షోత్సవము చేసుకొన్న స్వాతంత్ర్య సమర ఆరంభమునాడుగాని, (ఉ॥ఝాన్సిసీరాణీ) అంతకు పూర్వము పురాణాదియుగమునుండి గాని (ఉ॥ సత్యభామ, కైక) తరువాత ఉప్పుసత్యాగ్రహ క్విట్ ఇండియా నేటి గోవా సత్యాగ్రహముల వరకు భారతనారీమణులు తమ విధ్యుక్తధర్మాలను అకుంఠిత దేశభక్తితో మొక్కవోని ధైర్యస్థైర్యములతో తమధర్మాన్ని నెరవేరుస్తూనే వున్నారు. ఈవిషయమున ఆంధ్రమహిళను వేరుగ పేర్కొనుట అనవసరము.

కాని ఈ పండుగల సం...

ఆంధ్ర మహిళాసభ

వరలక్ష్మి వ్రతం

ఆంధ్ర మహిళాసభలో ఆగస్టు 9–8–57 వ తేదీని వరలక్ష్మీపూజ వైభవంగా జరిగింది. సభ కార్యదర్శినులూ, విద్యార్థినులూ, సభ్యురాండ్రు పాల్గొన్నారు.

★ ★ ★ ★

శ్రీపార్వతీ శంకరులా రూపాసౌందర్యా మమ్మా
సౌభాగ్యవతీ గౌరీదేవీ భాగ్యామెంతో చోద్యామమ్మా ||శ్రీ||
హితవూలేకా ఇతరూలనూ బ్రతిమాలినా ఫలమేలేదూ
అదిగోసతీ కాత్యాయనీ వేంచేసెనో మననగరికీ - ||శ్రీ||
కాశీక్షేత్ర వాసులకూ మోక్షా మొసగేటీ తల్లీ
దాక్షారాజూ పుత్రీయని దాక్షాయణీ వేంచేసెనో ||శ్రీ||
గౌరిపూజా చేసీనట్టీ నారీమణులకూ నెల్లా కోరీనట్టీ
వరమూలిచ్చే శారదాంబా వేంచేసెనో ||శ్రీ||

★ ★ ★ ★

జలజనయన చంద్రధరుని చేడె కారతీయగదే
మలయగిరి కుమారినీకు కలుము లొసగి బ్రోచునే
వేదపాలవిల్లి నన్ను ఆదరింప నీవెగాదె
ఆదిదేవి కర్పూరంపు హారతి గైకొమ్మటంచు
సదయహృదయ తులసిమాల నెదను దాల్చినట్టివారికి
ముదముమీర చెలియలమగు రదన బింబవదన చంద్ర||

విజయము

ఆంధ్ర మహిళాసభ

జూలై 1957 లో బెనారసు అడ్మిషన్ సప్లిమెంటరీ పరీక్షకు వెళ్ళి ఉత్తీర్ణులైన విద్యార్థినులు:

[illegible] అగర్వాల్: జి. విమల.

1857 స్వాతంత్ర్య సమరం



శ్రీ జొన్నలగడ్డ వెంకటరాధాకృష్ణయ్య

నేటికి సరిగా నూరు సంవత్సరాలక్రితం ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం జరిగింది. బ్రిటిష్ పాలనకు స్వస్తి చెప్పడానికి పటిష్ఠంగా దేశంలోని నాయకులు—వేర్వేరు మతాలకు చెందిన ప్రజలు-సిపాయిలు సాగించిన సమర మది.

1757 నుంచి ఈస్టిండియా కంపెనీ భారత దేశానికి వ్యాపారం పేరుతో వచ్చి, వేర్వేరు ప్రాంతాలలోని రాజులమధ్య, పాలకులమధ్య కలహాలు రేపింది. తన అధికారాన్ని దేశ వ్యాప్తంగా విస్తరించుకోసాగింది. దేశంలోని వ్యాపారాన్ని పూర్తిగా కైవసం చేసుకొంది. ఈ కంపెనీ పాలన దుష్ఫలితాలను ప్రజలు గుర్తించడానికి ఎంతో కాలం పట్టలేదు. ఆ పాలనపట్ల ప్రజలకు తీవ్రమైన అసంతృప్తి కలిగింది. దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో 1757-1857 ల మధ్య కంపెనీపాలనను ప్రజలు ప్రతిఘటిస్తూనే వచ్చారు.

18 వ శతాబ్దాంతంలోను, 19 వ శతాబ్ద ప్రారంభంలోను ఈస్టిండియాకంపెనీ పరిపాలనను పడగొట్టడానికి లేదా, అది విసరించకుండా నిరూపించడానికి బయలుదేరిన ఉద్యమాల అనేకం. అందులో ముఖ్యమైనది 1857 ఉద్యమం అదే తొలి భారత స్వాతంత్ర్య సమరమని చరిత్ర కారులు ఉగ్గడించారు.

ఆదిలో ఇది మీరట్‌లో ప్రారంభమైంది తదుపరి యిప్పుడు ఉత్తర ప్రదేశ్ గా వ్యవహరించబడుతున్న యు.పి, బీహార్, బెంగాల్‌లకు మధ్యప్రదేశ్ లోని కొన్ని రాష్ట్రాలకు,పంజాబుకు వ్యాపించింది.

ఆ ఉద్యమం బ్రిటిష్ పాలనను తీవ్రంగా ప్రతిఘటించింది. కొత్తనాయకులను సృజించింది బ్రిటిష్ వారితో పోరు సాగించిన నా స్వాతంత్ర్య యోధులు తాంతియాతోపే అహమ్మద్ ఉల్లా, కన్వర్ సింగ్, ఝాన్సీరా లక్ష్మీబాయ్, నానాసాహెబ్, బహదూర్ షాల పేర్కొనదగినవారు.

1857 ఉద్యమంతో భారత స్వాతంత్ర్య సమరంగా అశేష ప్రాధాన్యం వహించినప్పటికీ అది మరొక మహత్తర లక్ష్యాన్నికూడా సాధించింది.

1857 నాటి స్వాతంత్ర్య సమరాన్ని, ప్రధాని పండిట్ నెహ్రూ అన్నట్లు, పలువురు పలు పేర్లతో పేర్కొన్నారు. దానిని కొందరు సిపాయిల తిరుగుబాటు అన్నారు. అలా అన్నది చరిత్రకారులు మాత్రమే. కాని అది సిపాయిలకే పరిమితమైనదికాదు. కులమతభేదాలతో నిమిత్తం లేకుండా ప్రజలు అందులో పాల్గొన్నారు.

ఈ ఉద్యమానికి బహదూర్ షా నాయకుడు. అతని సతీమణి జానత్ మహల్ కూడా ఉద్యమానికి భర్తను ప్రోత్సహించింది. దేశంలో బ్రిటిష్ పాలనపట్ల సిపాయిలలో రేగిన అసంతృప్తి ప్రథమ కారణమైంది. ఢిల్లీ ఛలో దీనికి నినాదమైంది. నానాసాహెబ్, అయోధ్య నవాబులు, బహదూర్ షా, ఝాన్సీలక్ష్మీబాయి నాయకత్వం వహించి బ్రిటిష్ సేనానులను సిపాయిలను హతమార్చారు.

బహదూర్ షా ఢిల్లీకి చేరువగా, 1857 సెప్టెంబరు 21 వ తేదీని బందీయైనాడు. అతని కుమారులు వధించబడ్డారు. అతడు భార్యతో జీవితం బర్మాలో ప్రవాసాన వెళ్ళబుచ్చి మరణించాడు.

ఝాన్సీ లక్ష్మీబాయి అసమాన ధైర్య సాహసాలతో బ్రిటిష్‌వారి నెదిరించి, పోరి, గ్వాలియర్ కోటవద్ద సాగిన భీషణసంగ్రామంలో నేల కొరిగింది.

మహారాష్ట్రంలో జన్మించిన మహోజ్వల దేశభక్తుడు తాంతియాతోపే. నానాసాహెబ్ దర్బార్ లో తాంతియాతోపే సర్వసైన్యాధ్యక్షుడుగా వుండేవాడు. ఆయన తనకున్న కొద్ది బలంతోనే బ్రిటిష్‌వారితో ఆరోజుల్లోనే గొరిల్లా యుద్ధం సాగించిన ధీరుడు. అయితే తోటి మాన్ సింగ్ లంచాని కాశించి చేసిన విద్రోహం ఫలితంగా బ్రిటిష్‌వారికి పట్టుబడిపోయాడు. 1859 ఏప్రిల్ 18 న ఉరితీయబడ్డాడు.

విజయమో, వీరస్వర్గమో లక్ష్యంగా బ్రిటిష్ పాలకులతో పోరినవారిలో నానాసాహెబ్ ఒకడు.

బీహార్ రాష్ట్రంలో ప్రథమ భారత స్వాతంత్ర్య సమర సారథ్యం వహించిన అగ్ర నాయకులలో రాణా కుమారసింహ ఒకడు. బీహార్ లోని జగదీశ్ పూర్ లో ఆయన రాణాగా వుంటూ తన 80 వ ఏట సిపాయిలకు నాయకత్వం వహించి, ఈస్టిండియా కంపెనీ సేనలతో గెరిల్లా యుద్ధంచేసి ముప్పతిప్పలు పెట్టాడు. వీరోచితంగా బ్రిటిష్ సైనికులతో పోరి 1858 ఏప్రిల్ 26 వ తేదీని మరణించాడు.

కాశీకి చేరువనున్న రామనగరంలో జన్మించిన మంగళ్ సింహ్ అనే ఆయన కూడా తొలి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవాడే.

ఈ విధంగా అనేక మంది రాజులు, నవాబులు, బేగంలు బ్రిటిష్ పాలనను, ఆ పాలనలో వారు అనుసరిస్తూ వచ్చిన దమననీతిని, జరిపిన దౌర్జన్యాలను ఎదిరించడంలో ప్రజలు కూడా తోడ్పడ్డారు. ఆ నాటి దౌర్జన్యాలను దుశ్చర్యలను గాయాలను భారతజాతి ఎన్నటికీ మరిచి పోలేదు. ఆ నాటి త్యాగమూర్తులను విస్మరింపజాలదు. వారు సాగించిన తొలి స్వాతంత్ర్య సమర గాథ అజరామరమైనది. అదే ఆ తర్వాత బెంగాల్‌లో, లాహూర్ లో సాయుధ విప్లవాలకు ప్రోత్సాహ కారణమైంది. అదే జాతీయ నాయకుల హృదయాలలో స్వాతంత్ర్యాగ్నిజ్వాలను రేపింది. శాంతియుత మార్గాలలో స్వాతంత్ర్య సాధనకు ఉత్తేజం కలిగించింది.

కనకనే ఆనాడు ఆత్మార్పణ చేసిన యోధులకు నేడు మనం కృతజ్ఞతాంజలిని సమర్పిస్తున్నాము.

★



ఆనాటి విప్లవపు
అధినేతవైనావు
విధి వ్యతిరేకించిన
వీరస్వర్గం బంది

ప్రథమ భారత స్వాతంత్ర్య
సమరాన ధగధగా మెరిశావు నీ,
విమలచరితా అతిక్రమించావు
పురుష సింహాల పరాక్రమాన్ని

ఉత్సాహాన్ని పెక్కు
కత్తిచేబట్టి, డాలునడ్డుపెట్టి
ధాం! మన్న తుపాకు నడ్డుకొన్నావు
ధాం! మన్న దెబ్బల్లో స్వర్గాన్ని చేరావు
కైకొను మా నమస్సుల్ని
మా బాష్పాంజలి
మా పుష్పాంజలి
మమ్ము దీవించుమో స్వర్గవాసీ!

—మహేంద్ర

ద్వితీయ ఘట్టం

1885–1930

★

స్వాతంత్ర్య సమరం

శ్రీ కొత్తపల్లి రవివర్మ

ఇండియా ప్రభుత్వము ఆంగ్లేయ కిరీటాధిపతుల అధీనమైనపిమ్మట యుద్ధములు జరుగక పరిపాలనము శాంతముగ నున్నదనినను, ప్రజలకు కష్టములు లేవనిగాని, వారిలో అసంతృప్తి లేదనిగాని భావించుట పొరపాటు. వారి పాలనమున జరుగు లోపములను హ్యూమ్ మొదలగు పెద్దలు పార్లమెంటువారికి చూపి ఎప్పటి కప్పుడు సవరణ చేయింప ప్రయత్నించెడివారు.

రిప్పను ప్రభువు దేశభాషా పత్రికా శాసనమును రద్దు చేసి, స్థానిక స్వపరిపాలనమును స్థాపించి, స్వాతంత్ర్య చట్టమును ప్రవేశపెట్టి భారత రాజకీయములలో నూతన శకారంభకుడయ్యెను. ఈయన పరిపాలనములో తల పెట్టిన తుదిసంస్కరణముగా "ఇల్బర్ట్"గారి "ఇండియన్ మేజస్ట్రేట్లు, యూరపియనులు మొదలగు తెల్లనేరస్థులను విచారింపకూడదను నిషేధమును తొలగించిన బిల్లును పేర్కొనవచ్చును. దీనికి ఆంగ్లో ఇండియనులు వ్యతిరేకముగానుండుట వారి జాతీయాధిక్యమును శాశ్వతముగా నిలబెట్టుకొనుట కొరకేనని వివేకముగల భారతీయు లందరకు తెలిసినది.

దీనిమూలముననే భారతనాయకులందరకు తమలో సంఘీభావముండవలెనని తెలిసివచ్చినది. రాజకీయ మహా సభల అవసరము గుర్తించి, వాటి ప్రయోజనములగూర్చి కలకత్తా సభలో సురేంద్రనాథ బెనర్జీగారు ఉద్ఘాటించిరి. 1884 న కలకత్తాలో జరిగిన అంతర్జాతీయ ప్రదర్శన మూలముననే భారత జాతీయ మహాసభ నిర్మాణము గూర్చి మొదటి ఊహ కలిగినది. డేవిడ్ హ్యూమ్‌గారు "ఇండియన్ యూనియన్"కూడ జాతీయ మహాసభ స్థాపనకు కారణభూతమైనది.

మహాసభ పుట్టకపూర్వమే ఏబది వత్సరములనుండి జాతీయ నిర్మాణము ప్రారంభమైనదని చెప్పవచ్చును. రామమోహనరాయల కాలమునాటికే జాతీయ జీవనము సర్వతోముఖముగ విజృంభించియున్నది. అతడొక భారత జాతీయ ప్రవక్త. ఆధునిక భారతవర్షమునకు మూలపురుషుడు. రామకృష్ణుని రామకృష్ణమఠము ఆనాటికే భారత జాతీయ వికాసమునకు నూతన శోభ కలిగించినది. అది ప్రపంచములోని అన్ని జాతులను ఎదుర్కొనుచున్న అనేక సాంఘిక రాజకీయ సమస్యల పరిష్కారమునకు మార్గము చూపించగలిగినది.

జాతీయ మహాసభ నిర్మాణమునకు కారణభూతు డానాటి గవర్నర్- జనరల్ మార్క్విస్ ఆఫ్ డఫరిన్ అనిన ఎవరును నమ్మజాలరు. ఎ.ఒ. హ్యూమ్ 1884 లో "ఇండియాలోని ప్రధాన రాజకీయవేత్త లందరును సంవత్సరమున కొక పర్యాయము దేశమందలి సాంఘిక విషయములను చర్చించుట కొకచోట సమావేశమై పరస్పర స్నేహభావమును పెంపొందించుకొనిన అది బహు ప్రయోజనకారిగా యుండగలదని భావించెను. డఫరిన్‌గారి సలహాకై హ్యూమ్‌గారు వెళ్ళగా, సాంఘిక విషయములేగాక, రాజకీయ సమస్యలుగూడ చర్చింపమని వారు సూచించిరి.

మొదటి భారతజాతీయ మహాసభ పూనాయందు 1885 డిసెంబరులో జరుప నిశ్చయించిరిగాని, అచట కలరా విజృంభించుటచే ఆ మాసమందే బొంబాయియందు సమావేశమయినది. దాని పరమావధిని గుర్తించినది. దేశీయుల భారములను, కార్యములను ఒక్కచోట కేంద్రీకరించినది. రాజకీయ పారతంత్ర్య నిర్మూలనము దీని ముఖ్యోద్దేశ్యము. లక్షలకొలది ప్రజలలో ఒక విధమగు ఆత్మచైతన్యమును పెంపొందించినది. వారి కాత్మవిశ్వాసము, ఆశ, సంఘీభావములను పెంపొందింప చేసినది.

మింటో, మార్లే సంస్కరణములతో మరియొక రంగ మారంభమైనది. 1907 లో ఇండియా కౌన్సిలునకు ఇద్దరు భారతీయులు, పిమ్మట ముగ్గురు నిర్ణయింపబడిరి. 1909 లో గవర్నర్-జనరల్ కార్యనిర్వాహక సంఘమున కొక భారతీయుడు నియమింపబడెను. 1910 లో మద్రాసు ప్రభుత్వ సంఘము, బొంబాయి ప్రభుత్వ సంఘములకు చెరియొక భారతీయ సభ్యుడు నియమింపబడిరి. 1912 లో బీహారు, ఒరిస్సాలు ప్రత్యేక రాష్ట్రముగా చేయబడి దాని పరిపాలనమున కొక లెప్టినెంటు గవర్నర్, ఆతని కౌన్సిలులో ఒక భారతీయుడు నియమింపబడిరి.

ఇండియాకు బాధ్యతాయుత స్వపరిపాలనమును ప్రసాదించుటయే ప్రభుత్వోద్దేశమని చేయబడిన ప్రభుత్వ ప్రకటనకు 1919 లో జరిగిన కలకత్తా సభ సంతృప్తి వెల్లడించింది. ఈ యుద్దేశము పూర్తిగా నిర్వర్తింపబడుటకు తగిన కాలపరిమితి రాజ్యాంగచట్టములోనే నిర్ణయింపబడవలయుననియు కోరినది.

మాంటుఫర్డు నివేదిక జూన్ 1918 న 'వెలువడినది. దీనియందలి పొడుగైన ప్రణాళిక మూలమున కాంగ్రెసు-లీగు ప్రణాళిక మరుగున పడిపోయెను. మాంట్‌ఫర్డు స్కీముకు మూలసూత్రము ద్వంద్వపరిపాలనము. ఈ సిద్ధాంతమును బొంబాయి సభ అంగీకరించినది.

నూతన జాతీయోత్సాహము వంగరాష్ట్ర విభజనతో ప్రకటితమైనది. 1905 లో కాశీయందు సమావేశమయిన ఇరువదియొకటవ సమావేశము వంగరాష్ట్ర విభజనమును లాంఛనముగ ప్రతిఘటించి దానిని పూర్తిగ రద్దుచేయవలెనని తీర్మానించినది. కాని ఆనాడు వంగదేశమందు అవలంబించిన నిర్బంధ విధానమునుగూర్చి ఆ కాంగ్రెసు చేసిన ప్రతిఘటన తీర్మానము కొంత డొంకతిరుగుడుగాను, మరికొంత అనాలోచితముగను యున్నది.

సర్ ఆక్లండ్ కాల్విను మొదట జాతీయ మహాసభను శత్రుభావముతో చూడ మొదలిడెను. ఇతడు హ్యూముకు కాంగ్రెసును సంఘసంస్కరణ సంస్థగా మార్చవలసినదని సలహా ఇచ్చెను. పాపము హ్యూము మొదటియుద్దేశమదియేయనియు, డఫరిన్ ప్రభువు సలహావలననే మహాసభ రాజకీయసంస్థగా మారినదనియు ఈపెద్దమనిషి కప్పటికి తెలియదు.

1916 నాటికి, ఇండియా గోఖ్లే, ఫిరోజషాల మరణముతో నావికుడు లేని నావవలెను, దారములేని గాలిపటమువలెను యుండెను. పూనా జాతీయ మహాసభలో "హోమ్‌రూల్" అనే సంగ్రామ గర్జనం బయలుదేరింది. తిలక్ తలంపు "హోమ్‌రూల్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింపవలెనని."ఆ సందర్భముననే 23-4-1916న పూనా యందు "హోమ్‌రూల్ సంఘము" నొకదానిని వారు స్థాపించిరి. అనీ బీసెంటు ఈ సందిగ్ధ సమయమున కార్యరంగమున కురికినది. ఆమె "న్యూ ఇండియా" అను దినపత్రికను, "కామన్ వీల్" అను వారపత్రికను ప్రారంభించినది. సెప్టెంబరు 1 న "హోమ్‌రూల్ సంఘము"ను స్థాపించెను. దానికి "అఖిల భారత హోమ్‌రూల్ సభ" అని ఆమె 1917 లో నామ మిడెను.

1919 లో పేర్కొనదగినది చాంపరాన్ సంఘటన. ఇది బీహారురాష్ట్రమందలి యొక జిల్లా. తోటయజమానులు రైతులను "నీలిమందు" నిర్బంధముగ పండింపమనుటచే ఇచ్చటి పరిస్థితు లుద్రిక్తములైనవి. శిస్తు తగ్గింపుకొరకు రైతులు అలజడి చేసిరి. అనేక పర్యాయములు రైతులు గందరగోళములు తిరుగుబాటు రూపము దాల్చినవి. ప్రభుత్వము దీనివిషయమై ఏమియు చేయలేక కొన్ని వత్సరములనుండి అవస్థపడుచుండగా గాంధీజీ ఈ విషయమై ప్రత్యేకశ్రద్ధగైకొని స్వయముగ20,000రైతుల వద్దకు వెళ్ళి, వాఙ్మూలములు సేకరించి, ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వమునకు పంపిరి. ఆ నివేదికలోని సిఫారసులు చట్టములో బంధింపబడినవి. అచ్చటి యజమానులు పెక్కురు తమ స్వంత ఆస్తుల నమ్ముకొని వెళ్ళిపోయిరి. ఇట్లా సమస్య గాంధీగారి ప్రజ్ఞాపూర్వకమగు సేవచే కొద్ది వ్యవధిలోనే పూరింపబడినది.

మరియొక ఘటన ఖేడా సత్యాగ్రహము. బొంబాయి లోని కెయిరా జిల్లాలో పంటలు పాడవగా రైతులు భూమిసిస్తు తాత్కాలికముగ ఆపివేయుట న్యాయమని తలంచి, నాల్గవవంతుకంటె తక్కువ పంట పండినదని భూమిసిస్తులాసంవత్సరమునకు ముదరా ఇప్పింపవలెనని ప్రభుత్వము నడిగిరి. లాండ్ రెవిన్యూ చట్టము ప్రకారము భూమిశిస్తు ముదరా ఇప్పింపబడదని ప్రభుత్వ ముత్తరువులు జారీచేసినది. గాంధీ బహు పర్యాయ మిరుపక్షముల వారికి సఖ్యముచేయ ప్రయత్నించి, విఫలుడై రైతులను సత్యాగ్రహము ప్రారంభింపమని సలహా ఇచ్చెను. రైతులలో ప్రబోధము కల్గించుటకై సేవకుల కొరకు గాంధీ యొక విజ్ఞాపనమును ప్రకటించెను. వచ్చిన ప్రచారకులలో పటేల్ యొకడు. ఖేడా సత్యాగ్రహమే మహాపురుషులగు సర్దార్ వల్లభభాయ్ పటేల్, గాంధీలను ఒక్కచోట చేర్చగలిగినది. ఒక ప్రవాహమువలె సాగిన

రైతుల గంభీర సత్యాగ్రహ యాత్రకు ప్రభుత్వము నిలువలేక ప్రజలవాదము నంగీకరించి పేదరైతులందరకూ ముదరా ఇప్పించినది.

ఇంకొకటి అహమ్మదాబాదు కార్మికోద్యమోదంతము. ఆనాటిదే భాషా ప్రయుక్తరాష్ట్ర విభజనాందోళన. ఈ రెండింటిగూర్చి ప్రముఖులాసక్తి క్రమక్రమముగా తగ్గినది.

1919 ఫిబ్రవరిలో రెండు రౌలట్ బిల్లులు ప్రత్యక్షమైనవి. గాంధీజీ వీటి నంగీకరింపలేదు. 1920న ఖిలాఫతు ఉద్యమము పేర్కొనదగిన సమస్య. భారత మహమ్మదీయులు "ఖిలాఫతు కేవలము పారమార్థిక సంస్థగానే కాక, ఐహిక సంస్థగాకూడా శాశ్వతముగా నిలచి యుండుట వారి మత విశ్వాసమునకు మూల"మను సిద్ధాంతమును ప్రకటించి, వారొక్కమాటలో ఖిలాఫతు సమస్యగూర్చి వైస్రాయికి శ్రుత పరచిరి. కాని ఎవరి ప్రయత్నములు లేకనే దైవబలముచేగాబోలు అకస్మాత్తుగ 1922 లో ఈ సమస్య దానంతట అదే ముగిసినది.

1925 హిందూ మహమ్మదీయ మత కలహములతో మునిగిపోయినది. గాంధీజీ సూచన నీ ఇరువురిలో ఎవరును అంగీకరింపలేదు. కొంత రక్తము ప్రవాహములు కట్టినతరువాత ఆ ఉద్రేకము చల్లారెను.

సైమన్ కమీషన్ నియామకము మూలమున ప్రభుత్వమువారిపై ప్రజలకు కలిగిన అసంతృప్తితో 1928 సంవత్సరపు ప్రారంభదశలోని రాజకీయ వాతావరణము నిండియున్నది. దేశమంతటా సైమన్ బహిష్కారము గూర్చి ఆలోచనలు జరుగుచుండెను. ఫిబ్రవరి 3 న. బొంబాయి, కమీషన్ చేరినది. ఇండియా అంతటా హర్తాళ్ జరిగినది. ఢిల్లీలో "సైమన్! తిరిగిపో!" అనే అట్టలు ఊరేగించిరి. దక్షిణమున జస్టిస్ పక్షము (South Indian Liberal Federation) వారును, కొన్ని మహమ్మదీయ సంఘములవారును దప్ప, కన్యాకుమారి మొదలు ఆసేతుహిమాచలములవరకు గల ప్రజలందరును సైమన్ కమీషనును బహిష్కరించిరి. చాలాచోట్ల లాహోరులో లాలా లజపతిరాయ్, లక్నోలో జవహర్‌లాల్ వీపులపై పోలీసువారి లాఠీలు, బెత్తములు నృత్యము చేసినవి. సర్ జాన్ సైమన్ ఈ ధాటి కాగజాలక మార్చి 31 న. బొంబాయి రేవు విడిచెను.

ఆగస్టు అభ్యర్థి

శ్రీ యల్. కె. దుర్గాచార్యులు

స్వాతంత్ర్యలక్ష్మి, నీ-చలువ, పేదలగుండె
కభయమీనెడివేళ - నరయు టెన్నటికో!

చెడుదారులన్ మార్చి - ముకుమలన్ తెగటార్చి
జ్ఞానార్థికాదులన్ - యేనాడు బెంతువో

మానమే మానవుని - మనిషిగా నిల్పునా?
కూళయాచకబాధ - కూలిపోయేనా?

మాతగా నేతగా - "మహిళ"గా దాదివై
శాంతిగూర్తువె? ధాత్రి - కాంతి సంపదనంద

ఆగస్టు పదిహేను - అఖిల భారతజన
స్వాతంత్ర్య సౌభాగ్య - సాధనా దినమన

స్వాతంత్ర్యసమరం - 1930 - 1947

బ్రిటీష్ ప్రభుత్వం మాంట్ ఫోర్టు సంస్కరణలను 1921 వ సంవత్సరం ఏప్రిల్ నెలలో అమలులోనికి తెచ్చినది. ఈ సంస్కరణలవల్ల రాష్ట్రాలలో గవర్నర్లకు సంపూర్ణాధికారాలు ప్రత్యేకించబడ్డాయి. కొన్ని సంవత్సరములయాక యీ ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని పరిశీలించడానికి సైమన్ కమీషన్ పంపబడింది. వారికి మన జాతీయనాయకులూ ప్రజలూ సహకరించలేదు. మన దేశనాయకులెందరో లాటీ దెబ్బలకు గురైనారు. లాలాలజపతిరాయ్ అసువులర్పించాడు. 1931 లో చరిత్రాత్మకమైన దండీ సత్యాగ్రహం ప్రారంభించబడింది. దేశంఅంతా ఉప్పుచెయ్యడం మొదలుపెట్టి ప్రభుత్వాన్ని ధిక్కరించింది. అప్పుడు గాంధీజీతో వైస్‌రాయ్‌గాఉన్న ఇర్విన్ రాయబారాలు జరిపారు. తత్ఫలితంగా ఇద్దరూ ఒక సమాధానానికి వచ్చారు.

లండన్‌లో మూడుసార్లు రౌండుటేబిల్ కాన్ఫరెన్సు జరిగింది. మన జాతీయనాయకు లందరూ లండనుకు వెళ్ళారు. ప్రభుత్వమునకును పాలిత ప్రజలకును సమాన ప్రతిపత్తిని మహాత్మాజీ సాధించి విజయం పొందారు. 1935 లో గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఆక్టు పాస్ అయింది. ఇండియాలోని రాష్ట్రాలూ స్వదేశీ సంస్థానాలూ కేంద్రంలో శాసనసభ ఒక ఫెడరేషన్‌గా నిర్మింప బడాలనీ, రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వానికి స్వస్తిచెప్పి పరిపాలన మంత్రుల హస్తగతం చెయ్యాలనీ, అక్షరాస్యులందరికీ, పన్నులు చెల్లించేవాళ్ళందరికీ వోటుహక్కును కలగచేసి వోటర్లసంఖ్యను హెచ్చుచేయాలనీ, మొదలైనవి ఇందులోని ముఖ్యాంశాలు. ఫెడరేషన్ అమలులోనికిరాలేదు. కొన్నిరాష్ట్రాలకు సంబంధించినహంశాలు. ఏప్రిల్ 1937 నుంచి అమలులోకి వచ్చాయి.

ఎలెక్షనులు జరిగాయి. దేశంలోని పదకొండురాష్ట్రాలలోను ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసు ఘనవిజయం సాధించింది. కాంగ్రెసు మంత్రులే పరిపాలకులయారు. గవర్నర్‌జనరల్. గవర్నర్లకు గల ప్రత్యేక అధికారాలు అమలు జరపబోమని హామీ ఇచ్చారు, ప్రజావాణికి ప్రాధాన్యం లభించింది.

అయితే దేశందీనితో తృప్తిపడలేదు. మనకు కావలసినది సంపూర్ణ స్వాతంత్ర్యం. మహాత్మాజీ కొత్తరకం సత్యాగ్రహం ప్రారంభించారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామం జరుగుతూంది. భారత ప్రజలు యుద్ధం విషయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి సహకరించడం దేశ... ప్రజాస్వామ్య రాజ్యాల రక్షణకుకాదనీ, ఇంపీరియ లిస్టుల స్వలాభంకోసమేనని ఒక్కొక్కరే బహిరంగంగా వ్యక్తపరచాలనీ ఈ వ్యక్తిసత్యాగ్రహోద్యమంయొక్క ఉద్దేశం ఇందుకు మహాత్మాజీ మొదట సత్యాగ్రహిగా శ్రీ వినోబా భావేను నియమించారు. ప్రభుత్వ విద్రోహకరమైన ఈ వచనం దేశంలోని అసంఖ్యాకుల్ని జైళ్ళలోనికి పంపించింది.

1942 లో క్విట్ ఇండియా ప్రతిపాదనతో మనదేశంలోని స్వాతంత్ర్యకాంక్ష పరాకాష్టను అందుకుంది. 1857 సంవత్సరంనాటి 'ఢిల్లీచలో' నినాదానికి తిరిగి ప్రాధాన్యత వచ్చింది. దేశంఅంతా స్వాతంత్ర్య సిద్ధికి ఏలాంటి త్యాగాలైనచెయ్యడానికి సిద్ధంగాఉంది. అక్కడక్కడ విప్లవకరమైనసంఘటనలు పొడసూపాయి. బొంబాయిలో నావికులు తిరుగుబాటుచేశారు. దేశనాయకులందరినీ శ్రీ కృష్ణజన్మస్థానానికి పంపారు, గాంధిమొదలైన కాంగ్రెసు అధిష్టాన వర్గాన్ని ఎక్కడఉంచారో చాలాకాలం తెలియలేదు. వారు ఉన్న ఆగాఖాన్‌పేలస్ అప్పుడే పేరులోనికి వచ్చింది. మహదేవ్‌దేశాయ్, కస్తూర్బా దివంగతులైనారు. 1945 లో కారాగారాలన్నీ ఖాళీఅయిపోయాయి. లార్డుమౌంటుబేటన్ వైస్‌రాయ్‌గా ఇండియావచ్చారు. ఇండియా ఇండిపెండెన్సు ఆక్టు ఆఫ్ 1947 ఆగస్టు 15 తేదీని అమలులోనికి వచ్చింది. దేశంలోని కొంతభాగం పాకిస్థాన్‌గా ఏర్పాటయింది. గవర్నరుజనరల్ ప్రత్యేకాధికారాలకు పూర్తిగా ఉపసంహరణ జరిగింది. శాసనసభలకు సంపూర్ణాధికారం లభించింది. ఇప్పుడు అమలులో ఉన్న భారత రాజ్యాంగ ప్రణాళిక తయారై 1950 జనవరి 26 తేదీ నుంచి భారతదేశం సర్వస్వతంత్ర్య రిపబ్లికుగా అవతరించింది.

ఈ పోరాటంలో ప్రభుత్వాన్ని ఎదిరించి, కాంగ్రెసు అడుగుజాడల్లో నడిచి, స్వాతంత్ర్య సంపాదనలో అష్టకష్టాలూపడ్డ కొందరు మహిళామణులను ప్రశంసించక తప్పదు. మన తెలుగుదేశంలో ప్రధానంగా ఎన్నదగిన వ్యక్తి శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మ. శ్రీమతులు దుర్గాబాయి దేశ్‌ముఖ్, వేదాంతం కమాలాదేవి, మాగంటి అన్నపూర్ణాదేవి ప్రభృతులు కారాగారవాస క్లేశమేగాక లాటీ దెబ్బలకుకూడా గురియైనారు. 1857 లో ఝాన్సీ లక్ష్మీబాయ్ ప్రారంభించిన సమరానికి, అంతిమ విజయాన్ని సాధించినది భారతనారీమణులే అనిచెప్పటకు సందేహం ఎంతమాత్రంలేదు.



స్వాతంత్ర్య యోధుడు
ప్రకాశం

పదములు చాలవో మనసు పం
డిన వృద్ధమునీ! మనోజ్ఞముల్
కదలవు నాగె భావములు;
కల్పనలున్ పరుగెత్తిరావు నీ
హృదయములోతులో మొలచు
లించుక మెచ్చిన నా మనస్సులో
ఒదిగెను స్వప్నజాగరణ మహో!
ఇది చిత్రతరానుభూతి గదా!

నాలుగుకోట్ల తెల్గులకు నా
యకుఁ డీవొకరుండవైతివి; నా
చాలత నన్యులన్ గెలువఁ జా
లుట లబ్బుట బుద్ధిసేతయే;
పల విచారముల్ జగతి నీవిధ
నాయకతామహోన్నత
శ్రీలభితాధిపత్యము వసించెనె?
ఎవ్వరికి? నాయక ప్రభా!

—శ్రీ సామవేదం జానకిరామశర్మ.

తన రక్తంబును పోసి పెంచినది, మహాంధ్రత్వంబు మహాత్మ్యనిం
చిన సత్యాగ్రహి, శాంతిమయుడు ప్రజాశ్రేయస్సుఖార్థంబుగా
తన సర్వస్వము ధారపోసి, యనంత త్యాగి, అత్యున్నతిం చెం
దిన కర్తవ్య కాంక్ష [illegible] సమర్పణంబిచ్చి వినమ్రించనే.

—శ్రీ కె. [illegible]

పై పద్యములు ఆంధ్ర [illegible] సంచికలో ప్రచురింపబడినవి. [illegible]
[illegible] అందరు ఆంధ్ర [illegible] చింతించుచున్నవి.

భారత స్వాతంత్ర్య దశమ వార్షికోత్సవం

ఆంధ్ర మహిళా సభ

ఆంధ్ర మహిళా సభ భవన ప్రాంగణంలో నిన్న భారతస్వాతంత్ర్య దశమ వార్షికోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుపబడింది.

ఉదయమే విద్యార్థినులు- ఉపాధ్యాయినులు సమావేశమై జాతీయ గీతాలు పాడారు. కార్యదర్శిని శ్రీమతి లక్ష్మీపార్వతిగారు ఆహ్వానితులకు స్వాగతం చెప్పారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎ. ఎస్. పి. అయ్యర్ పతాకోత్సవం చేశారు. ఆయన ముచ్చటిస్తూ, సంపదిత మైన కులమత భాషావిభేదాలు దేశోపద్రవకరమని చెప్పారు. ఆర్థిక స్వాతంత్ర్యం, సాంఘిక స్వాతంత్ర్యం లేనిదే రాజకీయ స్వాతంత్ర్యం నిరుపయోగమని, ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యం లేని దేశం సహారా ఎడారితో సమానమని అన్నారు. ఆయన యింకా ఇలా చెప్పారు.

"భారత దేశం పూర్వ ప్రపంచ జాతులకు నాగరికత నేర్పినది. మన దేశానికి ఒక ప్రక్క మహోన్నతమైన హిమాలయము లక్కిన మూడు ప్రక్కల సముద్రం వున్నవి. ఇందువల్ల మన దేశానికి ఒక విశిష్టత కలిగింది. వేర్వేరు సమాజాలకు చెందిన వారమైననూ భారతీయులు ఏకమగుటవల్ల మన జాతి శక్తివంతమైనది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మహాత్మాగాంధీ, వల్లభాయ్‌పటేల్ మున్నగు నాయకులు దేశాన్ని అనేక విధాల సంస్కరించి ఉద్ధరించారు.

"హరిజనోద్ధరణ, హరిజన దేవాలయ ప్రవేశం ఎంతటి విప్లవ కార్యములైనను ఆ సేతు హిమాచల పర్యంతం మహాత్మాజీ ప్రబోధం వలన ఒక్క రక్తపు బొట్టు కూడ చిందకుండా ఈ సంస్కరణలు జరిగినవి. ఇది మనం గర్వపడ తగిన విషయం.

"రాజకీయంగా ఏర్పడిన స్వదేశ సంస్థానాల విలీనీకరణ రెండవ ఘనకార్యం. ఈ సందర్భంలో శ్రీ పటేల్ తోపాటు శ్రీ వి. పి. మీనన్ పేరు కూడా చెప్పక తప్పదు.

"మనం చెప్పుకోదగిన మూడవ గొప్ప విషయం స్త్రీల స్వేచ్ఛ. స్త్రీలకు పురుషులతోపాటు సమానావకాశములు కల్పించి, అన్నిరంగాంలోను ఉన్నతమైన ప్రతిపత్తిని కల్పించి భారతనారి సర్వసమర్థ అని నిరూపించారు.

"ప్రాంతీయ భాషలకు, దేశభాషలకు మూలమగు ప్రధాన భాష సంస్కృతమునకు ప్రాధాన్య మివ్వడం మరొక గొప్ప విషయం.

అన్నింటికంటె ముఖ్యంగా ప్రపంచం లోని వివిధ దేశముల తో సన్నిహిత సంబంధం ఏర్పరచి భారతీయులను ప్రపంచపౌరులుగ తయారుచేసి మన సంస్కృతి యావత్తు ప్రపంచమునకు అందచేశారు."

ఉపన్యాసానంతరము కార్యదర్శిని శ్రీమతి వి. తిమ్మాబాయి, కృతజ్ఞతాభివందనములతో సభ ముగిసింది తరువాత జాతీయ గీతముల పోటీ జరిగింది.



సభ ప్రారంభ సమయ ప్రార్థన. శ్రీ ఎ. ఎస్. పి. అయ్యర్. [illegible]

ఆంధ్ర మహిళా సభ

దసరా ఉత్సవములు

చిత్రకళా ప్రదర్శన


దసరా ఉత్సవాల సందర్భంలో సెప్టెంబరు 30 వ తేదీ నుండి నాలుగు రోజులు ఆంధ్ర మహిళా సభా భవనములో స్త్రీల లలితకళలు, చేతి పనులు, పరిశ్రమలు ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. మహిళలచే తయారు చేయబడిన నిట్టింగు, ఎంబ్రాయిడరీ, లేసులు, చిత్రకళ (డ్రాయింగు, పెయింటింగు) వగైరా ప్రదర్శింపబడతాయి. మద్రాసులోను, ఆంధ్రప్రదేశ్‌లోను వున్న స్త్రీలు, స్త్రీల సంస్థలు అన్నీకూడ ఇందులో పాల్గొనవలసినదని ప్రార్థన. అలా పాల్గొనడంవల్ల అనేకమంది స్త్రీలకు తమ కళానైపుణ్యాన్ని చూపించే వస్తువులు ప్రదర్శించే అవకాశం ఏర్పడుతుంది. ఈ ప్రదర్శన స్త్రీలంతా ఉచితంగా చూడవచ్చు.

ఆంధ్ర మహిళా సభ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, సభ్యురాండ్రు యితరులు తాము ప్రదర్శింప నెంచిన వస్తువులు సెప్టెంబరు 25 వ తేదీ లోపున సభకు పంపించి ప్రదర్శనము జయప్రదంగా జరుపుటకు తోడ్పడవలెనని ప్రార్థన. ప్రదర్శనానంతరం ఎవరి వస్తువులు వారికి వాపసు చేయబడతాయి.

ప్రదర్శనను గురించిన ఇతర వివరములు చిత్రకళాశాఖ సభ్యురాలు శ్రీమతి ఆర్. కమలాబాయిగారు, ఆంధ్ర మహిళాసభ, మైలాపూరు నుంచి తెలిసికొనవచ్చును.

మహిళా సభ దసరా ఉత్సవాలలో వినోద ప్రదర్శనలు, ఆటలపోటీలు, ఫేన్సీడ్రెస్సు పోటీలుకూడ ఉండును. మహిళా సభ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, సభ్యురాండ్రు, వారి పిల్లలు అంతా కూడా ఈ వినోదాల్లో (సంగీతం, డాన్సు, నాటకాలు, ఆటలు) పాల్గొనవలసిందని ప్రార్థన. వాటికి సంబంధించిన వివరాలు సభ ఆఫీసులో తెలుసుకొనవచ్చును. ఈ ఉత్సవాల పూర్తి కార్యక్రమం త్వరలోనే సభ్యురాండ్రకు అందజేయబడును.

వి. లక్ష్మీపార్వతి
బి. తిమ్మాబాయి
ఎ. పర్వతవర్ధని
సంయుక్త కార్యదర్శినులు.



పన్నులు

ఈమధ్య పన్నుల బరువు చాలాభారమై పోయిందని దేశ ప్రజానీకమంతా మూల్గింది. మూల్గు చున్నది కూడాను. కొంతమంది ధైర్యసాహసాలుగల మూకలు 'నీవునేర్పిన విద్యయే నీరజాక్ష' అనుకుంటూ సమ్మెలు చేశారు. అయినా పెద్దగా లాభమేమీ లేకపోయింది.

పరిస్థితులిలా విషమ స్థితిలోనుండగా దక్షిణ దేశము లోని ఒకానొక మహానుభావునకు ఒకచక్కని ఆలోచన తోచింది. అసలు అనాదినుండీ చక్కని ఆలోచనలన్నీ దక్షిణదేశములో పుట్టిన మేధస్సుకే తట్టుతవి అవి కృష్ణా గోదావరి కావేరీ జలాల ప్రభావమై యుండాలి. పన్నులన్నిటికీ పెరిగిపోవడము చూస్తూనే వున్నాము. అంతేకాకుండా క్రొత్తవాటికి పన్నులువేస్తే ఏమి చెయ్యలేక కట్టు కుంటున్నాము చావుకుపన్ను. పెండ్లికి పన్ను. పన్నుకు పన్ను, అన్నీ పన్నులే. అందుకే మొన్న అసెంబ్లీలో మన శ్రీ అంబగజన్ మరియొక కొత్తపన్ను వేయవలసినదని సలహాఇచ్చాడు. అదేమి అంటే బాహా టంగా గుళ్ళలో, గోపురాలలో ప్రార్థనామందిరాలలో ప్రార్థన చేసేవారికి పన్నువేయమని ఈ సలహా చాలా యుక్తంగా వున్నదని పండితులు అనకతప్పదు. దేవుడికి దణ్ణము పెట్టుకున్నా పన్నేనా అన్నవాడు అవివేకుడు కాగలడు. కాని ఈ పన్నుకూడా ఎక్కువగా దక్షిణ దేశము నుండి కేంద్రానికి ముట్టగలదనే విషయము మన శ్రీ అంబగజన్ సోదరుడు మరిచివుండవచ్చు. లేకపోతే అది పుతాణీ వారు సహించరు!

దేవునికి దణ్ణము పెట్టుకునేవానికి పన్ను అనేది నాస్తికుని సిద్ధాంతము మాత్రముకాదు. పనీపాటూ లేకుండా రాళ్ళకీ రప్పలకి పూజలూ గీజలూ ఎందుకు? ఈ గుళ్ళు గోపురాలెందుకు? ఈ దేవుళ్ళకు లంచాలెందుకు? ఇదంతా చాదస్తము కాబట్టి ఈ చాదస్థులు తమచాదస్థము వల్ల కొంత ప్రజాధనము ప్రభుత్వధనము ఖర్చు చేస్తున్నారు గనుక పన్నులు కట్టితే సరిపోతుంది అనే ఆసోచకుని భావము.

దీనిలో ఎంత సత్యముందో చూడండి ఈ మాటలు కేవలము ప్రభుత్వానికి ఆదాయము వచ్చే సూచన ప్రాయములు మాత్రమేకావు. సావధానంగా ఆలోచించ వలసి యున్నది.

బహిరంగ ఉమ్మడి ప్రార్థనలు మానవున కెంతవరకు ఉపయోగకరము? ఈ ప్రశ్న మునుపు ప్రఖ్యాత రచయిత వేదాంతి బెర్నార్డు షా నడుగగా ఆయన అసలు బహిరంగ ఉమ్మడి ప్రార్థనలో తనకేమాత్రము ఇష్టము లేదని

శెలవిచ్చి క్రిస్టియను మతస్థులచేల ఒక దుమారము లేవ నెత్తించాడు ఏమయ్యా ఎందుకిష్టము లేదన్న ప్రశ్నకు ఆయన జవాబు బహిరంగముగా ఉమ్మడిగాచేసేది అసలు ప్రార్థన కానేరదని ! అదిగదీ అసలు విషయము. మరి ప్రార్థన కాకపోతే ఏమవుతుంది—భజనా?

బహిరంగముగా ఉమ్మడిగా ఏ దేవాలయములోనో ప్రార్థనాలయములోనో ప్రార్థన చేసేటప్పుడు అసలు మనస్సు ఆ దైవముమీద బాగా లగ్నమవటానికి అవకాశ మంటూ వుంటుందా? అట్లా దేవాలయాలకి వెళ్ళి అసలు పూజలెందుకు చేయాలి ? ఇండ్లలోనే చేసుకోవచ్చునుగా ? ఇండ్లలోకూడా బహిరంగముగా విగ్రహ పూజ చెయ్యకుండానే మనస్సులోనే నిర్గుణ దైవమునకు నమస్కరించవచ్చునుగా? ఆమాటకు వస్తే నిర్గుణ బ్రహ్మ. నిర్గుణ దైవము మన పూజలు, నమస్కారాలు వాంఛించటము లేదుగా ! దానివల్ల ఫలితము లేదుగా మన మనశ్శాంతికే అట్టి దైవోపాసన అవలంబించాలిసొస్తుంది గనుక అది ఉమ్మడి బహిరంగ ప్రదర్శన కాకుండా పన్ను భారము పడకుండా ఎవరిళ్ళలో వాళ్ళు ఏదో అవస్థ పడితేనే సరిపోతుంది.

కానీ ఇక్కడొక్కమాట చెప్పకుండా వుండలేను. నేను బెర్నార్డుషాతో సంపూర్ణముగా అంగీకరిస్తున్నా. పుణ్యక్షేత్రాలలో దివ్యక్షేత్రాలలో ఒకానొక విశేషము మాత్రం లేదని చెప్పుటకు సాహసించను. అట్టి విశేషము మానవ మనస్సు కల్పితమే అయిన వాటిని గృహములు గృహాంగణములలోనే దేవతా పీఠములను దివ్యక్షేత్రమ్ముబగ మార్చగలవు కదా? అట్టితరిపన్నులకు భయపడ వలసిన పనికూడ లేదు.

పన్నులమాట అటుంచి పూజలయొక్క ఫలితమేమి? మనఃశ్శాంతి కలుగచేయుట మాట అటుంచి అవి సమరస సాంఘికభావమునకు తోడ్పడగలవా? అట్టిచో వాంఛనీయములేకాగలవు. కానిచో ఎవ్విధమునైనా నిషేదింపవలసినదే, అవి పన్నుల భయముతో మాత్రము మానుకొన అవసరములేదు. అది పిరికితనము కాగలదు సాంఘిక సౌభాగ్యమునకు ఏది తోడ్పడగలదో అది వాంఛనీయము కదా !

తమిళసోదరుని సలహాలు మనమూ ప్రభుత్వమూ ఆస్తిక నాస్థిక భావములతోగాక, ఆవేశకావేశములకు తాపయ్యక ప్రశాంతముగా ఆలోచించ వలసి యన్నది.



దేశసేవకురాలు అనిబెసెంటుసతి

★

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

★

దేశం సారహీనమైనప్పుడే ఉపదేశాలకూ, ఉపదేశకులకూ అవసరం కలుగుతూ ఉంటుందని వివేకానందులవారి మాట నుడివియున్నారు. సుప్రసిద్ధ దేశసేవికయై దేశాభ్యున్నతికి అవసరమైన అన్నిరంగాలనూ తన పవిత్రసేవలచే సుమారు పెబ్బదేండ్లు పావనంచేసిన అనిబెసెంటుజీవితం ఈ వాక్యానికొక నిష్కళోజ్జ్వలోదాహరణమైయున్నది.

అనేక విధాలుగా ఆమె మనుగడ దేశానికొక పెన్నిధియై విలసిల్లింది. జీవితాన్నంతటినీ సత్యాన్వేషణంలో సత్యారాధనంలో గడిపిన నిరంతర సత్యవ్రత దేశసేవారంగంలో ముందడుగుకి ఎన్నెన్ని దేశాలకో మార్గాన్ని చూపిన ఆధ్యాత్మజ్యోతి. బాల్యంనుంచీ మతవిషయాలలో, దైవవిషయాలలో సహజమైన విశ్వాసం కలదే అయినా ఆ యౌవనపర్వాలంలో దైవవిషయాలలో కలిగిన అనుమానాలు తీరకపోవుటచేత నాస్తికాన్ని వలంబించడానికి కూడా వెనుదీయక విద్యావిషయ సంబంధమైన సేవలలో, దేశసేవలలో దైవభావోద్దీపనాన్నమభవించి, అన్ని సంశయాలను ఆసేవావరణ కార్యకలాపాలలో పట్టించివేసికొని ఆసేవా ద్వారమున దైవత్వదివ్యాంశను, దివ్యజ్యోతిని కనుగొని దివ్యజ్ఞానదీపికా ప్రబోధినియైన పరమ భక్తురాలు. కార్యాచరణంలో వెన్నెముకగల వీరాంగన. అలసటఅనేదిలేకుండా నిరంతరము శ్రమించి నిష్కామముగా పాటుపడిన కర్మవీర. దీనజనులకు, పతితులకు, పేదలకు ముఖ్యంగా పేద విద్యార్థులకు ఆశ్రయమైన పెన్నిధి మందారము.

అట్టి మహోదారురాలి యొక్క, పావనశీల యొక్క నూటపదకొండవ జన్మదినము అక్టోబరు 1వ. తేదీని జరుగును. ఆ సందర్భంలో ఆమె సేవలచే జాగృతినొందిన భారతదేశం ఆమె జీవితాన్ని సంస్మరించుకోవటం భారతీయులకు విహితకృత్యమే తప్ప వేరేమికాబోదు.

ఆమె 1847వ సం. అక్టోబరు 1 వ తేదీనాడు ఇంగ్లాండు లోని లండన్ నగరంలో జననం. ఎమిలీ వుడ్ దంపతులకు కనుపంటగా అవతరించింది. తల్లిదండ్రులు ఆమెను ముద్దుగా 'అని' అని పిలిచేవారు. తల్లిదండ్రులిద్దరూ ఆయిర్లండు దేశీయులు. తండ్రి వైద్యశాస్త్రమున నిష్ణాతుడు. బహుభాషావేత్త. గణితము తత్త్వశాస్త్ర సాహిత్యములను అభిమానంగా అధ్యయనం చేసిన విజ్ఞుడు. విశేషించి ఆకాలపు క్రైస్తవమత బోధలను విము

ఖుడు. తల్లి సాధుశీల. పతివ్రత. శకునములలో, మతాచారలలో సంపూర్ణ విశ్వాసంకల సనాతని. విశేషించి సూక్ష్మ బుద్ధిశాలిని.

ఆనీకి అయిర్లండు దేశీయుల స్వాతంత్ర్యానురాగము, సౌజన్యము, ఔదార్యమును, తండ్రి పాండిత్యము. వివేకము, విచక్షణజ్ఞానమును, తల్లి పవిత్రశీలము, అమాయకత్వము, కష్టసహనము, సరళవర్తనము బుద్ధిసూక్ష్మత యునూ సహజమైన జన్మహక్కుగా సంక్రమించాయి.

ఆనీ చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. కుటుంబం చూడబోతే చాలా సామాన్యమైనది. అయినా ఎమిలీ చాలా ఓర్పుతో కష్టాలను, విపత్తులనూ ఎదుర్కొంటూ నిర్వహించింది. ఆనీ 14,15 సంవత్సరాల వయస్సుకల పసివయస్సులోనే మిల్టను వ్రాసిన పారడైజు లాస్టు మొదలగు ఉద్గ్రంథాలు చదవడమూ, వానిలోనిపాత్రలు ధరించి తనలోతానే అభినయించడమూ, నిరంతర గ్రంథపఠనం చేయడమూ, మతగ్రంథాలు చదివి తనలోతానే తర్కించుకొని నిర్ణయాలు చేయడమూ మొదలైన మంచిలక్షణాలుకల మంచిబాలికగా తయారైనది. అంతేకాక ఆనీకి ప్రకృతి సౌందర్యోపాసన కళారాధన అంటే చాలా ఆసక్తి. ఎక్కువకాలంతోటలలో, దొడ్లల్లో, చెరువుల్లో గడపుతూ ఉండేది. అంతే కాక స్వేచ్ఛగా గుఱ్ఱపుస్వారి చేయుట గొంతెత్తి ఆనందముగా భగవత్సంకీర్తనం చేయుట, గ్రంథాలయాలకు, సభాసమావేశాలకు, విందులకు వెళ్ళి విజ్ఞానప్రదముగా, వినోదముగా కాలముగడపుట మొదలైన కార్యాలలో మంచిపేరు సంపాదించుకొన్నది. ముఖ్యంగా చర్చిఅలంకరణ అంటే ఆనీ చెవికోసుకొనేది ఇరుగు పొరుగు పిల్లలను వెంటవేసుకొని బహుసుందరంగా చర్చి అలంకరించి పెద్దల ప్రశంసలను అతి గంభీరంగా అందుకొని తనలోతాను మురిసిపోయేది. ఈ శిల్ప కళా దృష్టిని ఆనీ జన్మాంతమూ విడువలేదు. ఆమె యెంతఆధ్యాత్మిక పరురాలైనా ఎంతసంఘ సేవానిమగ్నయైనా ఆమె ఉన్నచోటు ఒక నందన వనంవలె, ఒక స్వర్గధామంవలె రమణీయంగాఉండవలసిందే. అడయారులోని నిర్మాణాలు నివేశనాలూ, నిర్మల జలాశయోపేతోద్యానాలే దీనికి నిదర్శనం.

తల్లియొక్క మతాభిరుచియే బిడ్డనుకూడా మతాభిమానినిగా దిద్దింది. క్రైస్తవ భక్తులవలె తన జీవితాన్ని దిద్దుకోవాలని ఆమె శతధా ప్రయత్నిస్తూ దీనమానవసేవచేస్తూ కాలంగడప జొచ్చింది.

ఇట్లా కొన్నాళ్ళు గడిచిన వెనుక చర్చిలోని ఒక మతాధికారియైన ఫ్రాంక్ బెసెంటు అనే యువకునితో ఆనీకి పరిచయమైనది. ఫ్రాంక్ బెసెంటు తన్ను పెండ్లి చేసుకోవలసిందని ఆనీని ఒకనాడు సాహసించి అడిగాడు. ఆనీకి నిజంగా పెండ్లంటే ఇష్టంలేకపోయినా అనాథయైన తల్లి భారం తీరగలదనిన్నీ, మతాచార్యుని పెండ్లాడితే దీనమానవసేవ నిర్విరామంగా జరుగగలదనిన్నీ ఫ్రాంక్ బెసెంటును ఆనీ పెండ్లాడి ఆనీబెసెంటు సతిఅయినది.

కాని ఎంత గొప్పఆశయంతో తాను పెండ్లాడిందో అంతగొప్ప నిరాశతో క్రుంగి పోవలసి వస్తుందనీ, తన నిష్కపట ప్రవర్తన వలననే భర్తతో తనకు సంబంధ విచ్ఛేదం సంభవిస్తుందనీ ఆమె కలలోకూడా తలంచలేదు. అప్పటి ఇంగ్లాండు దేశపు మూఢాచారాలు, దేశంలోని స్వార్థపరత్వమూ, జనులదంభ ప్రవర్తనలే వారి వివాహ విచ్ఛేదనానికి కారణం. చిన్నతనంనుండీ సేవామతితో దీన జనసేవచేస్తూ స్వేచ్ఛగా, ఆనందంగా కాలంగడపి ఆ ఆశలతోనే తన్ను పెండ్లాడిన ఆనీని తాను భర్తకనుక తనభార్య తనకు లొంగి ఉండవలెనన్న సంకుచిత స్వభావంతో ప్రతి విషయంలోనూ కట్టడి చేయనారంభించాడు. సత్యాన్వేషణ దృష్టితో దైవ, మతాది సమస్త విషయాలనూచర్చించి నిజతత్వం గ్రహించి కపటంలేని ప్రవృత్తితో తాను నమ్మినదాని నాచరించే స్వభావంకల భార్య సేవా కార్యకలాపాలను అతడు సహించలేక పోయినాడు. కాపురం చేసినన్నాళ్ళూ ఆమె ప్రత్యక్ష నరకబాధలననుభవించింది. దానికితోడు ఆమెకు మతవిషయాలలో కొన్ని తీరనిసందేహాలు ఉత్పత్తిల్లినవి. ఇవన్నీకలసి మనస్సు స్థిమితంతప్పి క్రమక్రమంగా అనారోగ్యంలోకి దారితీసింది. అట్టిపరిస్థితిలోనే ఫ్రాంక్ బెసెంటు నిర్దయుడై ఆమెను వెళ్ళగొట్టివేశాడు. అప్పటికే ఆమెకు ఇద్దరు పిల్లలు. అందులో మగబిడ్డను తండ్రి తీసుకొని పసిబిడ్డయైన ఆడపిల్లను తల్లికి విడిచి వేశాడు.

భర్త వెళ్ళగొట్టిన తర్వాత ఆనీ దుర్భరదరిద్రబాధ నెదుర్కొని బిడ్డతో చాలాకష్టాలు పడింది. అయినా ఆమె జంకలేదు. వెనుదీయలేదు. దరిద్రబాధ వలనకంటె దేశము నందలి మూఢ, దురాగతాలు మతంపేరిట విశృంఖలముగా పవిత్రముగా చెలామణీ కావడం చూచి ఆమె యెక్కువగా భయకంపితురాలై పోయింది. మాయమర్మము లెఱుగని దైవభక్తురాలగుట చేతను, స్వచ్ఛశీలము కలదగుట చేతను భర్తతోడి ప్రణయబంధము విచ్ఛేదమగుట నైనను

ఆమె ఆరోగ్యించ గల్గింది. కాని భర్తయొక్క కఠిన ప్రవర్తన ఓర్చుకొనలేక పోయింది.


ఆమె భర్తను విడిచిపెట్టుట తనకు మనస్సు ఇష్టము లేకపోయిన, భర్త యొక్క బంధనములోనుండి బయటపడి అనంతంగా స్వేచ్ఛగా దీనజన సేవచేయ వచ్చును కదా అని ఆలోచన చేసుకొనింది. మిక్కిలి బాధలను కూడా సహించి సేవాసంఘములను పెట్టుకొని ప్రారంభించింది.

కాని మతాచారములను గూర్చి. లోకప్రవృత్తిని గూర్చి కొన్నేండ్లు జరిగిన తీవ్రమైన అంతరంగ మథనమును, తన బిడ్డ, తన తల్లిని కోల్పోయిన అనుభవములు, సంక్షోభములు, దైవ భక్తులు కూడా నివారింపని కష్టములు చాలా కొంతకాలం వచ్చును, మానవులు సదాచారములను విడిచి సత్యము, అహింస, భూతదయ, పరోపకారము వంటి ఉత్కృష్టమైన మొదలైన సూత్రములకు విలువ యిచ్చి బోధింపగా సంఘంలో వ్యతిరేకత వచ్చినా మొండిపట్టుదలతో క్రమక్రమముగా దేవుని అస్తిత్వము నందే ఆమెకు సందేహము కల్గించెను. దానికి తోడు చార్లెస్ హెన్. మిల్. కొంతటి మొదలైన పండితుల గ్రంథాలను కూడా ఆమె అప్పుడే చదవడం ప్రారంభించింది. దానితో ఆమెలో మిగులుతూ ఉన్న ఆ కొద్దిపాటి ఆస్తిక భావంకూడా తగ్గిపోయింది. తర్వాత చార్లెస్ బ్రాడ్లా అనే వారి ఉపన్యాసాలచే ఆకర్షితురాలై ఆమె "నేషనల్ రిఫార్మర్" అనే సంస్థలో సభ్యురాలై, చార్లెస్ బ్రాడ్లా గారి సహచారిణి అయ్యింది. పూర్తిగా నాస్తికురాలు కాలేదు, అయితే కేవల నాస్తికవాద పూర్తిగా దేవుని అంగీకరించుటకాదు. కాని దేవుడున్నాడో లేడో! మానవులు సృష్టించుకొన్నదో దేవుడున్నాడో నిజమని నమ్మినను. అను సిద్ధాంతమునకై వాదించుట కన్నది ఈ సిద్ధాంతమును అనే మనస్సునకు కొంత తృప్తి కల్గించింది.

క్రమక్రమంగా ఆమె పత్రికలకు వ్యాసములు వ్రాయుట, నాస్తికంగా ఉపన్యాసము లిచ్చుట, పత్రికొక పత్రికను నిర్వహించుట, అనేక సంస్థలకు కార్యదర్శిని యగుట, నిరంతరము గ్రంథ పఠనము సాగించుట, పతిత మానవుల సేవ సల్పుట మొదలైన కార్యకలాపాల్లో నిమగ్నురాలై పోయింది. ఆమె నాస్తికవాద కాలంలో అయినప్పటికీ నపుంసకత్వం గురించి ఫ్రాంక్ పోకెంటు కోర్టులో వ్యాజ్యం చేసి ఆమె నాశనంగా ప్రేమించే కూతురును కూడా స్వాధీనం చేసుకొన్నాడు. నిజంగా అప్పుడు ఆమెకు కల్గిన దుఃఖం ఇంతా అంతా కాదు. కాని ఏమైనా ఆమె ధైర్య హిమాచలం చలించలేదు. ఒక్కొక్క సంఘటన జరుగుతూన్న కొలదీ సేవా కార్యక్రమం పట్ల పట్టుదల, దీక్ష అధికం కాజొచ్చి

నది. అయితే స్త్రీ సంఘం యొక్క ఈ అస్వతంత్రత అన్యాయ చట్టాలకు వశించి పోతుండా అని ఆమె కొంత ఆలోచించి స్త్రీల హక్కుల కోసం ఆందోళన చేయుటకు కీలకముగ ఆమెకు చాలా ఉపకరించింది. అటుతర్వాత ఆమె దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించారైన తర్వాత కేవలం ఆమె సిద్ధ నాథైన తర్వాత మళ్ళి తిరిగి ఆమెనే చేరుకున్నారు. ఆమె సర్వీసులకు కనబడక దుర్భాగ్యం, అని కొందరు. ఆమె ఇంగ్లాండు దేశంలోని అనేక అభ్యుదయ చట్టాల కోసం సర్వశక్తులూ ప్రయత్నాలు చేసింది. అనేక కష్టాల్లో దేశం కోసం పోరాటం కొనసాగించింది. స్వయంగా తానే కోర్టు లలో వాదనలు కూడా చేసింది. మొదట బ్రాడ్లా గారి మొండితనపు నిలువగా అయిన కొద్ది 1874 లో తాను కీలకంగా కూడా సంబంధ మేర్పడ్డది. ఇంగ్లాండు లోపల, విదేశాలలోపల క్రమక్రమంగా ఆమె ఉన్నత సాంఘిక సూత్రాలు చాలా వ్యాప్తి చెందినాయి. ముఖ్యంగా ఆమె ఉపన్యాసాలు వినుటకు జనం తండోపతండాలుగా వచ్చేవారు. ఏ విషయంలోనైనా ఆమె ప్రత్యేకించి యోచించిగాని ఆలోచించి కాని సాధించకుండ రాదు. నిర్ణయించితే వెంటనే అతి సూక్ష్మంగా విషయం గ్రహించి అతి సులభంగా దానిని ఆచరణలో పెట్టి ఇతరుల సహయోగము పొందేటట్లు చేసేది. సేవానిష్ఠకు సంబంధించిన ఈ లక్షణాల వలన ఆమెను ప్రశంసించేవారు చాలా ఎక్కువై పోయినారు.

ఇవన్నీ ఇట్లా ఉండగా 1875 వ సంవత్సరంలో మేడాం బ్లావట్స్కీ, ఆల్కాట్ గార్లు దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించి పత్రికలలో దాన్ని గూర్చి విశేషంగా ప్రచారం చేయ ప్రారంభించింది. ఆ సమయములో ఆ సమాజ స్థాపకులలో ఎల్లప్పుడూ ఆధ్యాత్మికముగా లోకము. బాల్యం నుండీ సహజంగా ప్రవహించిన కల ఆమె అంతరంగము ఈ దివ్య



రచయిత్రి

జ్ఞాన ప్రచారం మళ్ళీ ఆకర్షించింది. కొన్నాళ్ళ వఱకూ ఆ మతాన్ని స్వీకరించడమా, మానడమా' అనే ఆలోచనతో ఆందోళనతో మనస్సు పిరుపీకులాడినా. ఆఖరుకు ఆమెలోని సహజమైన ఆధ్యాత్మిక ప్రవృత్తియే బలీయమై యామెను మఱల ఆస్తిక భావంలోకి లాగివేసింది. ఇట్లా ఈమె మాటికి మాటికీ మతాలు మార్చడం ఆమె సహచరులకు బొత్తిగా గిట్టకపోయింది. అయినా, ఆమె సత్యమని నమ్మింది ఆచరించడంలో వెనుదీయలేదు. ఏ రంగంలో పనిచేసినా నిర్విరామకృషితో పాటుపడడం తప్ప సోమరి తనం ఆమె యెఱుగదు.

కూలీల దారిద్ర్య సమస్యలు, స్వామ్యవాదుల కష్టాలు, స్త్రీల ఉద్యమాలు, పిల్లల సమస్యల బాగోగులు, రాజకీయాలు ఒకటననేల అనింటిలో ఆమెయే అయిసర్వతోముఖంగా శ్రమించింది- సర్ జాన్ లబ్బల్ అనే ఆయన "పిల్లలచేత 12 గంటలు పని చేయించవలె" ననే అభివృద్ధి నిరోధక చట్టం ఒకటి పార్లమెంటులో ప్రవేశపెట్టగా కరుణాళువైన బెసెంటు సతి దాన్ని తీవ్రంగా ఖండించింది. ఆమె నిష్కల్మషసేవా పరతకూ, హృదయ సౌజన్యానికీ ఇట్టివెన్ని తార్కాణాలనో చూపించ వచ్చును.

ఇట్లా అవిరళసేవా మతితో తన దేశాన్ని ఉద్ధరిస్తూ ఆమె దివ్యజ్ఞాన సమాజోద్ధరణకై 1893 నవంబరు 16 వ తేదీ నాడు పవిత్ర భరత భూమిలో అడుగు పెట్టింది.

అడుగుపెట్టటమే తడవుగా బెంగుళూరు, తుత్తి కోరన్ మొదలైన స్థలాల్లో ఉపన్యాసాలిస్తూ భారతీయ హృదయార విందాలను తన సందేశాలతో వికసింపజేస్తూ మద్రాసు చేరుకొన్నది. ఆ రోజులలో ఆమెను మించిన వక్తలులేరు. ఆ ఉపన్యాసాల వలననే ఆమెకెన్ని మహత్కార్యములు సులభసాధ్యాలయేవి. ఆమె భరత ఖండానికి వచ్చిన తర్వాత ఈ భూమినే ఆమె జన్మభూమిగా భావించి అఖండసేవచేసింది. ఇక్కడకు రాగానే తనకు మిక్కిలి పరభాషైన భారతీయ భాష సంస్కృతమును అభ్యసించి వేద వేదాంగాలనూ, మత గ్రంథాలనూ, భగవద్గీతనూ అధ్యయనం చేసింది. భారతీయ జనసామాన్యుల కష్టసుఖాల్లో పాల్గొని వారి ఉద్ధరణకై పాటుపడింది. ఆమె సహజంగా దేశసేవిక కావడంచేత ఎక్కడ ఏ దేశంలో ఏ మానవ సంఘానికి అక్రమం జరుగుతూన్నదో ఆ అక్రమాన్ని సమయింప చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పాటుపడింది. కాని స్వదేశాభిమానమనీ, పరదేశ తిరస్కారమనీ ఆమె ఎన్నడూ హృదయంలోనైనా భావించలేదు. కాబట్టే భారతీయులలోని తీవ్రమైన స్వాతంత్ర్యేచ్ఛాందోళనలను కనిపెట్టి బ్రిటిష్ వారిపై వ్యతిరేకోద్యమం లేవదీయడానికి సహితం వెనుదీయలేదు. 1914 లో మొదటి ప్రపంచ సంగ్రామం ఆరంభమైనప్పుడు బ్రిటిష్ వారు చిక్కులలో ఉన్నప్పుడే ఆ సమయంలో బ్రిటిష్ ప్రధాన మంత్రిగా ఉన్న లాయడ్ జార్జి' చేసిన ఒక తప్పునాధారంచేసుకొని భారత దేశ స్వాతంత్ర్యము కొఱకై బ్రిటిష్‌వారి నొత్తిడి చేస్తూ భారతీయుల నాయుద్యమానికాయత్తంచేయ జొచ్చింది. భారతదేశం ఆమెకు జన్మస్థానం కాకపోయినా. ఇంగ్లాండు ఆమెకు జన్మస్థానమైనా న్యాయం కొఱకు పోరాడి విశ్వాన్నంతా తనదిగా భావించి విశ్వశ్రేయస్సుకోసం పాటుపడే ఉదారురాలు కావడం వలననే బెసెంటు సతి కడగండ్లలోనున్న భారతీయులలక్ష్యాన్ని బ్రిటిషువారి నెదుర్కొన్నది.

ఆదిమొదలామె భారతదేశంలో కూడా చేయని సేవా కార్యంలేదు. ముఖ్యంగా ఆధ్యాత్మికంగా భావనాపరతంత్రయై దివ్యజ్ఞాన సమాజాధ్యక్షత వహించి ఎన్నో విధాలుగా ఆ సమాజాన్ని అభివృద్ధిచేసింది- సాంఘిక రాజకీయ రంగాల్లో కూడా భారతీయుల పురోభివృద్ధికై అహరహమూ కృషిచేసింది.

ఇట్టి సేవాకార్య కలాపంలో పేర్కొనతగినది. ఆమె లేవదీసిన హోమ్‌రూల్ ఉద్యమం అప్పుడు ఇండియాలో భారతీయుల స్వాతంత్ర్యాందోళనకు కేంద్రంగా అఖిల భారత కాంగ్రెసు సంస్థ పనిచేస్తూఉన్నది. ఆసంస్థ సమావేశాలలోని తీర్మానాలను ఆచరణలో పెట్టి పనిచేయుటకు కాంగ్రెసు ఆదరణతో హోమ్‌రూల్ లీగును స్థాపించవలెనని సలహానిచ్చెను. కానిం అదలి పెద్ద లందులకంగీకరింపక పోయిరి. అయినా బెసెంటు మానక "హోమ్‌రూల్" ఉద్యమమును లేవదీసి దానికొఱకై ఎన్నో గ్రంథములు న్యూయిండియా మున్నగు పత్రికలు పెట్టి తీవ్రముగ ప్రచారమొనర్చెను. అసంఖ్యాకులుగా భారతీయులీ యుద్యమంలో చేరి బలపరచిరి. క్రమక్రమంగా ఆఉద్యమం దేశవ్యాప్తమై మిక్కిలి కీర్తి ప్రతిష్ఠల నార్జించినది. ఇది చూచి బ్రిటీషుగవర్నమెంటువారు చాలా భయపడిపోయి న్యూయిండియా పత్రికకు 2,000 రూ.లు ఫరాపతు కోరినారు. ఆమెను నిర్బంధించినారు కాని ఆమె జంకలేదు అంతేకాక అప్పటి రాజకీయనాయకులైన తిలకు గోఖలేలకు మధ్య ఏర్పడిన విభేధములను తొలగించి 1915 లో వారికి సామరస్యం కుదిర్చి భారతీయులను ఋణగ్రస్తులను చేసుకొన్న మహనీయురాలీమె. 1817 ఈమె దేశసేవను

గుర్తించి ప్రజలు కలకత్తా కాంగ్రెసున కధ్యక్షురాలుగా ఎన్నుకొని గౌరవించినారు కూడా. కానీ తరువాత మహాత్మా గాంధీజీకీ, ఈమెకూ ఏర్పడిన భేదాభిప్రాయముల మూలమున నామె కాంగ్రెసు సంస్థయందలి అంతరంగిక ప్రసక్తిని తగ్గించుకొన్నదేకాని భారత దేశసేవ మానలేదు. అంతేకాక తాను కలకత్తా కాంగ్రెసున కధ్యక్షతవహించి తిమ అధ్యక్షత కాలంలో ఆ సంస్థ కొఱకు నిర్విరామకృషి చేయవలెననే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి తక్కిన వారికి మార్గదర్శి అయిన కర్మవీరురాలు బెసెంటు.

ఆమె యెక్కడికి వెళ్ళినా జనులు తండోపతండాలుగా ఆమె ననుసరించేవారు. కోరకుండా నేల క్షలకొలదీ ధనం సంప్రాప్తమయ్యేది. ప్రజాదరణ హెచ్చవుతూన్న కొలదీ ఇంకా ఎక్కువ ఆసక్తితో సేవారంగాలను విస్తరింపజేసుకొంటూ, తనకు ప్రాప్తించిన అఖండధనరాసులను మఖిల ప్రజాహిత కార్యాలలోనే ఖర్చు పెట్టూండేది.

భారతదేశానికి వచ్చిన కొత్తలోనే కాశీలో నేషనల్ హిందూ కాలేజీని స్థాపించి అందులో అధ్యాపకత్వం చేయడానికి అరండేలును విదేశాలనుండీ రప్పించింది. తరువాత మదనమోహన మాలవ్యా హిందూ విశ్వవిద్యాలయం స్థాపించాలనే కోర్కతో ఆ కళాశాలను తనకిచ్చి వేయమని కోరగానే ఆ కళాశాలను ఆయనకు ఇచ్చివేసింది. తర్వాత ఆ విశ్వవిద్యాలయంలోనే ఆమె డాక్టరు బిరుదంతో సన్మానింప బడింది. మళ్ళీ కలకత్తాలో, మద్రాసులోని అడయారులోనూ దివ్యజ్ఞాన కళాశాలలను స్థాపించి బాలబాలికలకు విద్యాభ్యాసంతో బాటు కర్మక్షేత్రమునూ ఆధ్యాత్మిక శక్తినీ చూపించి పెంపొందింప జేయాలనే ఆదర్శంతో పాటుపడింది. తన సహచరులైన కజిన్సుసతి జినరాజదాసాసతుల తోడ్పాటుతో అఖిల భారత మహిళా మండలిని స్థాపించి రాజకీయాలతో సంబంధం లేకుండా స్త్రీల హక్కులకొఱకూ, స్త్రీల ప్రతిపత్తుల కొఱకూ పాటుపడింది. ఆసంస్థ యిప్పుడు శాఖోప శాఖలుగా విస్తరిల్లి భారతదేశమంతటా అల్లుకొని మహా ఉద్యమాలకు పట్టుకొమ్మయై, స్త్రీలపాలిటి కల్పవృక్షమై విరాజిల్లుతూ ఉన్నది.

అంతేకాక బాలభట ఉద్యమము నాదరించి ఆ ఉద్యమాన్ని సుసంపన్నం చేసింది. క్రమశిక్షణ అంటే ఆమె కెంతసహజాభిమానమో అనేవిషయం ఈ క్రిందిఘట్టాన్ని పరిశీలిస్తే తెలియగలదు. పంచమజార్జీ ప్రభు దంపతులకు స్వాగత సన్మానాలిచ్చే సందర్భములో హడావిడిగా ఉండి బెసెంటుసతి దారికడ్డంగా నిలువబడిఉన్న పధ్నాలుగేండ్ల బాలభటుణ్ణి దారికడ్డం లెమ్మని కోరింది. వెంటనే ఆ పిల్లవాడు తడుముకోకుండా "ఇదిమాధళాధిపది ఆజ్ఞ నేనిక్కడనుండికదలరాదు'' అని జవాబుచెప్పెను. వెంటనే బిసెంటుసతి ఆపిల్లవాని క్రమశిక్షణకు, విధినిర్వహణ శీలమునకూ చాలా సంతోషించి తనతప్పునకై ఆపిల్లవానిని క్షమించగోరిందట.

ఆమెకు వేదాంతాదిగహనతార్కిక విషయాల్లో ఎంత ప్రజ్ఞాప్రవేశాలు ఉన్నవో, సంగీతము, శిల్పము మున్నగు కళావిషయాల్లో కూడ అంతసమగ్రప్రజ్ఞాప్రాభవాలు ఉన్నవి. దీనికి ఆమె తయారుచేసిన జిడ్డుకృష్ణమూర్తి అరండేలు రుక్మిణిమున్నగు వారే నిదర్శనం.

ఉత్తమవక్త్రియై, అలసతి, కాలాతిక్రమము నెఱుగని కర్మవీరయై సుశిక్షణకల సత్కార్యావలంబినియై, స్వార్థమెఱుగని సేవాపరురాలై, నిష్కల్మషానురాగంతో శత్రుమిత్రులను సమముగా ప్రేమించి ఆదరించిన సత్స్నేహయుకురాలై, ఉత్తమలేఖకురాలై, సేవయేతానై, తానే యొక భువనసేవాసంస్థయై విశ్వమంతటినీ సేవామండలం చేసుకొని, పుట్టింది మొదలు గిట్టునంతవరకూ నిర్విరామకృషితో ఆధ్యాత్మిక రాజకీయ సాంఘిక, నైతికరంగాలలో సేవలొనర్చిన నిష్కళంక దేశసేవిక అనీబెసెంటుసతి. కావుననే ఆమె తన స్మారక చిహ్నంపై "ఆమె సత్యము ననుసరింప గోరినది'' అనే వాక్యం మాత్రమే వ్రాయమని కోరినది. అట్టి మహనీయురాలిని అక్టోరు 1 వ తేదీనాడు ఆమె శుభజన్మదినసందర్భంలో సంస్మరణ రూపంగా పూజించడం భారతీయులకే గర్వకారణం.

శ్రేష్ఠి జాతకము

కవయిత్రీ తిలక

శ్రీమతి పిండిప్రోలు వసంతా దేవి

(అఖిలాంధ్ర సాహిత్య పరిషత్)

వారాణసీ పురవరములో మున్ను
నిత్య సత్య వ్రత నిష్ఠాపరుండు
భూరి కృపారస బుద్ధియౌ శ్రేష్ఠి
దాన వీరుండయి తనరుచునుండె

ఆతని సత్యశీలతకు, నాతని
ధర్మ పథైక నిష్ఠకున్
ఆతని దాన తత్పరత, కాతని
శుభ్ర విశాల బుద్ధికిన్
ఆతని దైవభక్తికిని నచ్చెరు
వంది నృపోత్త ముండు సం
ప్రీతిని బిల్వనంపి, తనప్రేమకు
పాత్రునొనర్చె నెంతయున్

ఆ మహనీయు భూరి యశ
మష్టదిశల్ ప్రసరింప, నాతడున్
కామితముల్ ఫలించు నను
కాంక్షను జేరెడి యాచకాళికిన్
నీమముతో సపర్యలను
నిండుగ జేయుచు, తృప్తి దీర ని
ష్కామముగా తదీయ ధన
సంపద లిచ్చుచునుండు నిచ్చలున్

స్నాన మాదిగా నియమముల్ చక్క దీర్చి
చందన మలంది, భోజనా సక్తుడైన
వణిజవరు గేహమున నొక్క వాసరమున
వచ్చె ప్రత్యేక బుద్ధుండు బిచ్చముకయి

అచ్చపు నిండు భక్తిని గృహాంగణ
సీమకు శ్రేష్ఠి పత్నియున్
తెచ్చె రసాన్న పాత్రను యతిప్రభు
కీయగ; అంత మారుడున్
మచ్చర మూని వారలకు
మధ్యను రౌరవమున్ సృజించి, తా
నచ్చట నిల్చె నుగ్రనయనమ్ముల
గ్రక్కుచు విస్ఫులింగముల్

ఆ భయంకర దృశ్యమ్ము నామె కాంచి
మరలి భయమున, భక్తితో మనవి చేయ,
అన్న పాత్రను స్వయముగా నందుకొనుచు
వచ్చె వణిజుండు బుద్ధున కిచ్చు కోర్కె

ద్వారము పొంత నున్న బహు
దారుణ చిత్రము గాంచు శ్రేష్ఠితో
మారుడు పల్కె: "నీ వలె నమాయికులై
సిరి యెల్ల దానమున్

పేర వ్యయమ్ము చేసికొను పెద్దలకున్
తగినట్లు శిక్షకై
రౌరవనామ రూప మిదె
రక్షిత వాసము దాతృకోటికిన్

"ఏల ధనమ్ము సంపదయు
నీగతి నర్థులపాలు చేయుచున్
కూలెద వయ్య, యీ ప్రళయ
ఘోర గభీరము రౌరవమ్ములో?
జాలము చేయ కింక ధన
సంచయమున్ తగ గూర్చి హాయిగా
కాలము బుచ్చు మింద్రియ సుఖమ్ముల
నెంతయు నోలలాడుచున్

"ఇచ్చకపు మాట లేవియో నచ్చ బలుక
నర్థి ధోరణి కుబ్బి యథార్థ మనుచు
అడిగినది యిచ్చి స్వకుటుంబ హాని చేయు
దాత దండనార్హుడన నధర్మ మగునె?"

"ఎవ్వడ వోయి, నీ విటుల నేటికి
దానము పాపమూలమై
నెవ్వగలన్ ఘటించు నని
నేరుపు మీర నుపన్యసింతువే!
నవ్వుదు రెల్లలోకను
జనమ్ములు ధోరణి" కంచు శ్రేష్ఠితా
నవ్వలి గట్టు చేర గమనాతురుడై
నరకంబు డిగ్గినన్

స్థూల నాళ పద్మమ్ము తోడ్తోన మొలిచె
దాని సాహాయ్యమున బుద్ధు దరిని జేరి
మరలి వచ్చిన యంత గుమ్మమ్ము నందె
మారుడును రౌరవమ్ముతో మాయమయ్యె.

వచ్చు సత్పాత్రునకు బిచ్చ మిచ్చు నిచ్చ
ప్రాణహానిని తలపక ప్రతిఘటించి
కష్ట నష్టాల నన్నింటి గడచి నట్టి
బోధిసత్త్వుని చర్య సుబోధ మనునె

ఆంధ్రప్రదేశ్‌లో సంఘ సంక్షేమం

జిల్లా ప్రాజెక్టు నిర్వాహక సంఘాధ్యక్షుల, ప్రధాన ప్రాజెక్టు వ్యవస్థాపకుల సమావేశం.

కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 1957 జూలై 13 వ తేదీని హైదరాబాద్‌ను దర్శించినప్పుడు ఆంధ్రప్రదేశ్ సంఘ సంక్షేమ సంస్థ సభ్యులను కలుసుకొన్నారు. జిల్లా ప్రాజెక్టు నిర్వాహక సంఘాల అధ్యక్షులను, ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రధాన ప్రాజెక్టుల వ్యవస్థాపకులను సమావేశ పరచి ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ సంఘ సంక్షేమ సభ్యుల సమావేశంలో ఆమె కేంద్ర సంస్థ తలపెట్టిన ప్రణాళికలకు, కార్యక్రమాలకు సంబంధించిన పెక్కు అంశాలను గురించి చర్చించారు. భావి కాలంలో ప్రదేశ్ సంఘ సంక్షేమసంస్థ సభ్యులు విశేషమైన బాధ్యతను నిర్వహించవలసి వుంటుం దన్నారు.

జిల్లాకు బాధ్యతగల సభ్యురాలు ఆ జిల్లా లోని సంక్షేమ కార్యక్రమాలకు, పాత ప్రాజెక్టుల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టులు అమలు జరపడానికి, సంస్థలు, ఆశ్రమాలు మున్నగువాటి నిర్వహణకు పూర్తిగా జవాబుదారీ వహించి, మంత్రివలె వ్యవహరించవలసివుంటుందని, ఆమె ఎక్కువ ఆసక్తితో పనిచేయలేకపోయినా, తనకు ఆ బాధ్యతల నిర్వహణ అసాధ్యమనిపించినా ఆసంగతి స్పష్టంగాచెప్పి, తన సభ్యత్వానికి రాజీనామా యిచ్చి, ఎక్కువ ఆసక్తితో పని చెయ్యగల మరొకరికి అవకాశమివ్వాలని ఆమె వక్కాణించారు.

పారిశ్రామిక విద్యాలయాలను గురించి ప్రసం గిస్తూ, వాటిని ప్రాజెక్టు ప్రాంతాలలో ఏర్పాటు చెయ్యవచ్చునన్నారు. ప్రాజెక్టు కేంద్రాలలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం అవసర మనీ, సంక్షేమ కార్యక్రమంతోపాటు చిన్న పరిశ్రమల నిర్వహణకూడా కొనసాగాలని, పారిశ్రామిక విభాగంకల కేంద్రాలలో సంక్షేమ కార్యక్రమం జయప్రదంగా కొనసాగుతున్నట్లు తాను అనుభవంమీద చెప్పగలమని శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అన్నారు.

సహకారపద్ధతిని అగ్గిపెట్టెల ఫ్యాక్టరీల నిర్వహణనుగురించి మాట్లాడుతూ అనధికార సభ్యులైన మహిళలకుకూడా వాటి నిర్వహణలో భాగం వుందని, వారి సభ్యత్వం కేవలం నామ మాత్రం కాదని ఆమె అన్నారు. ప్రభుత్వోద్యోగులే ఫ్యాక్టరీ నిర్వహిస్తే, అది కేంద్ర సంక్షేమ సంస్థ ప్రణాళిక కానేరదన్నారు.

బ్లాకు-ఇంప్లిమెంటింగ్ కమిటీలకు మహిళలే అధ్యక్షపదవి వహించి కష్టపడి పనిచెయ్యాలన్నారు.

జిల్లా ప్రాజెక్టు నిర్వాహక సంఘాధ్యక్షుల సమావేశంలో ప్రసంగిస్తూ ప్రాజెక్టు ఆర్గనైజర్ల బాధ్యతలను, ప్రతిపత్తిని వివరిస్తూ, 25 గ్రామాలుకల బ్లాకును, 50 మంది కార్యకర్తల కృషిని పర్యవేక్షించే అవకాశం కలగడమే గొప్ప అవకాశమన్నారు.

రాష్ట్ర సంక్షేమ సభ్యురాలు శ్రీమతి డి. లక్ష్మిబాయమ్మగారి వందనసమర్పణతో సమావేశం ముగిసింది.

సౌఖ్యాన్వేషణ

కొమ్మూరి ఉషారాణి
బి. ఎ., బి. ఎల్.

"అమ్మా! పక్కయింటి వనజలాగ నాకూ జడకుప్పలు పెట్టుకోవాలనుందే! కొనిపెట్టవూ?"

"ఇప్పుడు కాదమ్మా!"

"ఏం ? ఎందుకని ?"

"మన దగ్గిర అంత డబ్బులేదు. మనం బీద వాళ్ళం"

కామాక్షమ్మ చెరచర వంటింట్లోకి వెళ్ళి పోయింది. లలిత ఆమె వెళ్ళిన వేపే ఓ రెండు క్షణాలు మౌనంగా చూసింది. తర్వాత నెమ్మదిగా లేచివెళ్ళి కిటికీదగ్గిర నిలబడింది. బైట మఱ్ఱిచెట్టుకింద ఎంతోమంది పిల్లలు దాగుడు మూతలు ఆడుకుంటున్నారు. ఆ పిల్లల నవ్వుల గలగలలు, ఆటపాటలు లలితని ఆనందంలో ముంచేయలేదు. లలిత బుఱ్ఱలో రకరకాల ఆలోచనలు పరుగెడుతున్నాయి.

'తనకి ఓవస్తువు కావాలి. అది లభించేందుకు తను చేయగలిగిందేమీ లేదా ? అమ్మ ఏమో బీదవాళ్ళం, లేనివాళ్ళం అంటుంది? ఆ బీదరికం పోవటమెలాగ ? పోనీ, ఎన్నాళ్ళకి పోయి, తను హాయిగా తనకి కావలసిన వస్తువులు పొందగలదు ?' లలిత గుండె బరువుగా మూలిగింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

ప్రపంచంలోని సమస్త అన్యాయాలనీ తార్కిక దృష్టితో విమర్శించి, వాపోయే దుఃఖం కాదు అది. ఆ రేళ్ళ పసి హృదయపు ఆవేదన అది. ధర్మాధర్మాలకి నిర్వచనం తెలియని లేతమనసు అది. తనకి ఎంతో కావాలనుకున్న వస్తువు లేకుండా పోయిందే అని బెంగపడిన అమాయక కన్నీళ్ళవి.

ఆ హృదయారాటాన్ని, కన్నీళ్ళనీ తల్లి ఈ విధంగా తుడిచేయ ప్రయత్నించింది. "పిచ్చి పిల్లా ! అవి కావాలి, ఇవి కావాలి అని మారాం చేసి బెంగపెట్టుకో కూడదు. ఈ ప్రపంచంలో మనకి ఎన్ని కావాలీ అని కోరుకుంటామో, దానికి రెట్టింపు దుఃఖము, అశాంతీ మిగులుతాయి చివరికి." కామాక్షమ్మ ఆ మాటలు చెబుతున్నప్పుడు కూతురి ముఖంకేసి చూడలేదు. ఆ రేళ్ళ లలిత వాటిని అర్థం చేసుకోగలుగుతుందా లేదా అని ఆలోచించలేదు. తన ఆత్మ శాంతికోసమే ఆ మాటలిని పైకి గట్టిగా అని తృప్తిపడింది. భగవంతుడు తనపట్ల చూపిన నిర్దయనీ, అన్యాయాన్ని కూతురికి చెప్పాలనీ, ఆ బాధ కూతురితో పంచుకోవాలనీ తల్లి ఆరాటం. కానీ ఏ వాక్యం ప్రారంభించినా, లలిత లేతవయసు జ్ఞప్తికి వచ్చి మాటనిలిపేసేది. తన అభిప్రాయాలు, ఆలోచనలు కూతురి మనసు వికలం చేస్తాయేమో ! ఆమె భవిష్యత్తు నాశనం చేస్తాయేమో ! పోనీ తను కాకుంటే తన కూతురైనా ఎందుకు సుఖపడకూడదు అనుకునేది తల్లి.

కానీ ఆమె ఆశలు ఫలించలేదు. లలిత జీవితంలో ఒక్కొక్క వసంతం, ఒక్కొక్క కోరికనీ, ఆశనీ, ఉత్సాహాన్ని పెంచుతూ వచ్చింది. ఆమె చిలిపి కళ్ళు, లేత పెదవులు, గులాబీరంగు చెక్కిళ్ళు, కొత్త ఆనందాన్ని, శోభనీ పులుముకున్నాయి. లలితకి రంగురంగుల బట్టలు కట్టుకోవాలనిపించింది. రకరకాల నగలు వేసుకోవాలని కోరిక కలిగింది. తన తోటి స్నేహితురాళ్ళలో

కోవాలనిపించింది. అవన్నీ లభించనందుకు ఆమె బెంగపడి కృశించిపోలేదు. ఆమెకళ్ళల్లో ఎప్పుడూ ఏవేవో కలలు నాట్యమాడేవి. ఆమె మనసు ఏవో తెలియని సౌఖ్యాలకోసం ఆరాట పడేది. ఆమె హృదయం ఆమె నిజపరిస్థితిని దాటి కొన్ని వందలమైళ్ళు దూరంగా పరుగెత్తిపోయేది.

అంతే కాదు; తన లేమితనం, దారిద్ర్యం భగవంతుడు తన ముఖాన రాసి పెట్టాడు అనుకోలేదు లలిత. ఏవో బలవత్తరమైన బాహ్య శక్తులు, పరిస్థితులు తన దురదృష్టాన్ని లిఖించాయని తెలుసుకోలేదు లలిత. తన దారిద్ర్యం ఏదో కృత్రిమమైనదిగా తోచింది ఆమెకి. అందుకనే ఓనాడు సంతకి వెళ్ళినప్పుడు, ఎంతో నిర్భయంగా, చులాగ్గా ఓ గాజుల జతని దొంగిలించింది. ఆ విషయం తెలిసి కామాక్షమ్మ చాలా బాధపడింది. లలితని తిట్టింది. కొట్టింది. ఇక ఎప్పుడూ అలాటి పనిచేయనని ఒట్టు పెట్టించుకుంది.

కానీ లలితకి ఆ గాజులు తొడుక్కున్నప్పుడు చాలా ఆనందమేసింది. దాన్ని నలుగురూ బాగుందని మెచ్చుకున్నప్పుడు గర్వమేసింది. "ఛీ! ఛీ! నేను ఎంత నీచపు పనిచేశాను!" అని లలిత ఆత్మ పరిశీలన చేసుకోలేదు. "ప్రపంచంలో ఇంతమంది యిన్నిన్ని సుఖాలు అనుభవిస్తున్నారే! నాకే ఎందుకు ఈ నికృష్టపు బ్రతుకు? నేను ఎటువంటి పాపం ఎరుగనే? అలాటిది నేను చేయని నేరానికి ఎందుకు శిక్ష అనుభవించాలి? కొట్టువాడి దగ్గిర అన్నేసి గాజులున్నాయే! నేను రెండు ఎత్తుకొచ్చినంత మాత్రాన వాడికి వచ్చిన నష్టమేమిటి? అయినా నేను గాజులు తీసేయడం ఎవరూ చూడలేదుగా. ఫరవాలేదు. పోనీ! అమ్మ అంతగా అడిగింది కనుక, యిదే మొదటిది, ఆఖరిది. ~~ఈమాటు~~ యిక ఎవరి వస్తువూ ముట్టుకోను" అనుకుంది.

కానీ ఆ 'చిన్న' చాపల్యం లలితని ఒ పట్టాన వదిలిపెట్టలేదు. ఆమెని అంటిపెట్టుకొని రోజు రోజుకీ హెచ్చు కాసాగింది. ఇతరుల వస్తువులు అపహరించేందుకు కాస్త చురుకుదనం, జాగ్రత్త వుంటే చాలునని గ్రహించింది లలిత. ఆ విషయం ఆమెకి చాలా ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ యిచ్చాయి. మనసులో కొత్త ఆశలు చిగుర్చాయి. కామాక్షమ్మకి కూతురి స్వభావం అర్థంకాలేదు. "భగవాన్! నా కూతురికి పాప భీతినీ, దైవభీతినీ కలుగజేయి" అనే ప్రార్థించింది. కానీ భగవంతుడు ఆమెప్రార్థనలని ఆలకించలేదు.

తల్లి మతం రుచించక, ప్రపంచంలో తనలాగే లేమి తనంతో జీవిస్తున్న వారి మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేక, మానవ విలువలలో విశ్వాసం నశించి, చిత్రమైన మానసికావస్థలో వున్న లలితని ప్రణయాలు చుట్టుకున్నాయి. పాపభూయిష్టమైన ఈ జగత్తులో ప్రేమించే హృదయాలు కూడా వుంటాయా అనుకుంది లలిత. అందుకనే శేఖర్ అనే యువకుడు, "నిన్ను రోజుకి ఒక్క సారయినా చూడకుంటే వుండలేను. అలా చూస్తావేం? నా బాధ అర్థం చేసుకోలేవూ?" అని బతిమాలినప్పుడు, ఆలోచనా పూర్వకంగా తల వొంచుకుంది. కానీ కాలక్రమాన తనలో కూడా అలాంటి అనుభూతి ఏదో కలుగుతోందని తెలుసుకుంది. ఆ మాట అతనితో చెప్పింది. శేఖర్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు.

కానీ లలిత అతని సంతోషాన్ని పంచుకోలేక పోయింది. ఆమెలో ఓ వింత సంఘర్షణ ప్రారంభమయింది. తన తల్లి తండ్రుల గతచరిత్ర, చిన్ననాటి నుంచీ తనలో పెంపొందుతున్న చాపల్యం, అతను ఎక్కడ పసికట్టి, మనసు మార్చుకుంటాడో అని అల్లల్లాడి పోయింది. తన సహజ ప్రవృత్తి, దౌర్బల్యాలూ, అతనికి తెలియకూడదనే తాపత్రయంలో, అతనికి దగ్గిరగా రావటంపోయి, మరింత దూరం కాసాగింది.

శేఖర్ చాలా తెలివిగలవాడు. సూక్ష్మగ్రాహి. ముక్కుకు సూటిగా పోయేనైజం గల

వాడు. "నా దగ్గిర ఎందుకంత జంకుగా వుంటావు? నీ గురించి నాకు ఎంతో తెలుసుకోవాలని వుంది. నాతో హృదయం విప్పి మాట్లాడవేం?" అనడిగాడు ఎన్నో సార్లు లాలనగా. ఆ ప్రశ్నలు లలితని మరింత కలవర పెట్టేవి.

ఇక వారి వివాహానికి కొద్ది రోజులున్నాయనగా, ఒక రోజు లలితాశేఖరులు ఓ విందు భోజనానికి వెళ్లారు. అది కమలమ్మ అనే ఒక కలిగిన వారింటి గృహప్రవేశ మహోత్సవం. రంగురంగుల దీపాలతో, అలంకరణలతో యిల్లు కిటకిటలాడుతోంది. లలిత ఒక వాయిల్ చీర కట్టుకుంది. చేతికి రబ్బరు గాజులు తొడుక్కుంది. మెళ్ళో పూసల దండ వేసుకుంది. శేఖర్ ఓ నూలు చొక్కా, పాత పంట్లాము తొడుక్కున్నాడు. నిజానికి ఆ జనం మధ్య, వారిద్దరూ కాస్త 'విడిగా' కనపడు తున్నారు. లలితకి ఆ విడిపడిపోవటం ఏ మాత్రం నచ్చలేదు. మనసు చాలా కష్టపెట్టుకుంది. వారి మధ్య నుంచి బైట పడాలని తొందర పడింది. శేఖర్‌కి ఆమె నైఖరి బోధ పడలేదు.

కమలమ్మ లలితని చాలా రోజులుగా ఎరుగును. ఆ పిల్లంటే ఆమెకి చాలా అభిమానం, ప్రేమ. లలితాశేఖరులు శలవు తీసుకునేందుకు వచ్చేసరికి, కమలమ్మ చాలా ఆశ్చర్య పడింది. "అదేమిటే పిల్లా! అప్పుడే వెళ్ళిపోతానంటావ్? కాస్త ఫలహారమన్నా తీసుకోవూ?" అంటూ లలితని ఆప్యాయంగా తన పక్కనే కూర్చోపెట్టుకుంది. శేఖర్ సంకోచంగా గుమ్మంలోనే నిలబడ్డాడు. "రా అబ్బాయి! లోపలికి రా" అంటూ ఫలహారం తెచ్చేందుకు కమలమ్మ వంటింట్లోకి దారి తీసింది. "అంత శ్రమ ఎందుకండీ! మేం వెళతాం" అంటూ శేఖర్ ఆమెని అనుసరించాడు.

లలిత తను కూర్చున్న గదిచుట్టూ కలియ చూసింది. నిలువుటద్దం దగ్గిరకి వెళ్లి తన ప్రతిబింబం చూసుకుంది. ఆ రూపు ఆమెకి అయిష్టతని కలిగించింది. అక్కడ నుంచి చరచర కిటికీ దగ్గిరకి నడిచింది. బైట సన్నాయి, గోల ఆమె చెవులకి అపశ్శృతిని పలికాయి. లలిత వెనక్కి తిరిగింది. అక్కడే బల్లమీద ఉన్న ఓ చిన్న దంతపు పెట్టె మీద పడింది ఆమె చూపు. ఎన్నో నగిషీలు చెక్కి వున్న ఆ పెట్టె చూడముచ్చటగా, ఎంతో అందంగా వుంది. లలితలోని కళా హృదయం, ఆ శిల్పచాతుర్యాన్ని, పని తనాన్ని ఎంతో మెచ్చుకుంది. లలిత దాన్ని చేతిలోకి తీసుకుంది. దాని వంక ఆశగా, తృష్ణతో చూసింది. వెంటనే తత్తర పాటుతో అటూ ఇటూ చూసింది. ఆ క్షణంలో ఆమె వివేకం, నీతి నియమాలు ఆమెని ఏకాకిని చేసి వెళ్ళిపోయాయి.

ఇంతలో ముందు శేఖర్ వెనక కమలమ్మ గుమ్మంలో వచ్చి నిలబడ్డారు. లలిత చేతిలోని వస్తువు చూసి శేఖర్ నిర్ఘాంతపోయాడు. లలిత ముఖాన నెత్తురు చుక్కలేదు. బాధతో, అవమానంతో పెదిమలు వణికాయి.

కమలమ్మ పరిస్థితి యిట్టే గ్రహించింది. గబగబ లలిత దగ్గిరకి వచ్చి ఆమె బుజంమీద చెయ్యి వేసింది. "శేఖర్! ఈ బహుమతి ఎలా వుంది చెప్పు? ఏమే లలితా నేను అంత ప్రేమగా యిస్తే తీసుకో సంకోచిస్తున్నావా?" అని పకపక నవ్వబోయింది. శేఖర్ కను బొమలు చిట్లించాడు. అతనిమనసులోని ఎన్నో సంశయాలిని అతని ముఖం తీరే విశదం చేసింది. అతనికి కావలసిన ఎన్నో సమాధానాలు లలిత కనుకొలకులే విప్పిచెప్పాయి.

ఇంటికి వెళ్లేదారిలో ఆమెని ఒక్క ప్రశ్న వేసి వేధించలేదు. ఆమె ఒక్క విషయం చెప్ప ప్రయత్నించి ఆత్మ వంచన చేసుకోలేదు. కానీ ఆ రాత్రి లలిత కమలమ్మని కలుసుకుంది. తన కృతజ్ఞత తెలుపుతూ, ఆమెను కావలించుకు బావురుమంది. "అక్కా! యిందులో నే చేసిన

త్యాగమేముంది ? ఈ విషయం మర్చిపో'' అని బుజ్జగించి పంపేసింది కమలమ్మ.

కానీ లలిత ఆ సంఘటనని ఆమె చెప్పినంత సులభంగా మర్చిపోలేకపోయింది. లలిత మనసులో యిప్పుడు హృదయాన్ని పిప్పిచేసే దుఃఖం లేదు. తన భవిష్యత్తు నాశనమైపోయిందే అనే నైరాశ్యం లేదు. ఒక్కటే కొరత, ఒక్కటే వెలితి, బాధ మిగిలి వుంది. తన మనసుకి యిది శాశ్వతగాయం...తన ప్రేమకి యిక ప్రతిధ్వని లేదు...ఈ క్రూర ప్రపంచం తనకి ప్రేమ అనే అనుభూతిని కూడా లేకుండా చేసింది...శేఖర్ మరిరాడు...మునుపులా తనని ప్రేమించలేడు .. ఆ భయంకర సత్యం ఆమె మనోభావాలనీ, ఉద్రేకాలనీ కొత్త దారులంట పరుగెత్తించింది.


ఆ మర్నాడే లలిత శేఖర్‌ని కలుసుకుంది. "శేఖర్ ! నేను దొంగని. కమలమ్మ నాకు ఆ పెట్టెని బహూకరించలేదు. నేనే దాన్ని దొంగిలించ ప్రయత్నించాను. ఇంతకు క్రితంకూడా నాకు చాలాసార్లు యిలాంటి దుర్బుద్ధి కలిగింది. యింకా విను! మా నాన్న ఖూనీకేసులో యిరుక్కుని కొన్నేళ్లు జైల్లో వున్నాడు. మా అమ్మకి యిది...రెండో...పెళ్లి...ఇవన్నీ నీ దగ్గిర దాచి, నిన్ను మభ్యపెట్టి, వివాహమాడి, నేను ఎటూ సుఖపడలేను. నీకూ శాంతివుండదు. నువ్వు మంచి కుటుంబంలో పుట్టావు. విద్యాసంస్కృతులు గలవాడివి. ఈ విశాల ప్రపంచంలో మనిద్దరి దారులు వేరు. మన జీవితాలు కలవలేవు. అసలు నాలాటివారు ఈ భూమికే భారం. చెప్పు శేఖర్ ! చెప్పు ! ఈ ప్రపంచంలో సౌఖ్యమనేది ఎందుకింత నిర్దయగా పంచబడింది. మనుష్యులు తాము చేయని నేరాలకి కూడా శిక్ష ఎందుకు అనుభవిస్తారు?'' అంటూ బావురుమంది లలిత.

శేఖర్ ఆమె తల పైకెత్తాడు. ఆమె కన్నీళ్లు తుడిచాడు. లలితా! ఎందుకలా బాధ పడతావు? నీ తల్లి తండ్రుల దౌర్బల్యాలకి నువ్వు బాధ్యురాలివి కాదు. ఇక నీలోని బలహీనతలని సరిదిద్దుకునేందుకు నీకు అవకాశం లేకపోలేదు. ఈ ప్రపంచం నువ్వనుకున్నంత పాపభుయిష్ఠమైంది కాదు. అధర్మం పక్కనే ధర్మాన్నీ, అన్యాయం పక్కనే న్యాయాన్నీ, కాఠిన్యం ప్రక్కనే కరుణనీ, ద్వేషం పక్కనే ప్రేమనీ సృష్టించాడు భగవంతుడు. లేకుంటే ఈ ప్రపంచం ఎప్పుడో అంతరించిపోయేది. మానవులు యింత ప్రగతిని సాధించేవారు కాదు. నామాట నమ్ము''అంటూ ఆమెని దగ్గిరకి తీసుకున్నాడు. లలిత ఆనంద బాష్పాలతో అతని భుజం తడిసిపోయింది.

ఆంధ్ర మహిళా సభ

పాల పంపకము

జూలై నెలలో పాల పౌడరు పాలు 3546. మంది బీదపిల్లలకు పోయించితిమి. ఈ పాల పంపకం ప్రతి శని, ఆదివారములలో నాగేశ్వరపురములోను, మిగిలిన రోజులలో ఆంధ్ర మహిళాసభా ఆవరణములోను, ప్రతిదినము ఉదయం 7 గంటలకు జరుపబడుచున్నది.



రాజకీయాలు

శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

ఈ నెలలో జరిగిన అతిముఖ్య సంఘటన. ఆగస్టు 15 వ తేదీని భారత స్వాతంత్ర్యదిన దశమ వార్షిక మహోత్సవం తోపాటు మనం జరుపుకొన్న 1857 నాటి ప్రప్రథమ భారత స్వాతంత్ర్య సమరశత వార్షికోత్సవం, తంతి, తపాల ఉద్యోగుల సమ్మె ప్రమాదం విరమణ ఆంధ్ర సాహిత్య అకాడమీ సంస్థాపన ముఖ్యమైనవి.

అణు విద్యుచ్ఛక్తి కేంద్రాలు

గతమాసం చివరి వారంనుంచి జరిగిన సంఘటనలను వరసగ సమీక్షిద్దాం. గత ఆగస్టు 26 వ తేదీని భారత ప్రధాని లోకసభలో ఒక ప్రకటన చేస్తూ విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి మనదేశంలో ఒకటిగాని, అంతకంటె ఎక్కువ గాగాని అణువిద్యుదుత్పాదక కేంద్రాలను నెలకొల్ప డాన్ని గురించి ఇండియా ప్రభుత్వం శ్రద్ధగా యోచిస్తున్నదని ప్రకటించారు.

బస్సుమార్గాల జాతీయకరణ

ఆంధ్రప్రదేశ్‌లో బస్సుమార్గాలను పూర్తిగా జాతీయం చెయ్యాలని చాలారోజులుగా కొందరు ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ సభ్యులు సూచిస్తూవచ్చినమీదట ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు జూలై 26 న ఒక ప్రకటన చేస్తూ ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని జిల్లాలలో అయినా బస్సుమార్గాల నిర్వహణకు ఒక కార్పొరేషన్‌ను స్థాపించడానికి తాము యోచిస్తున్నామన్నారు.

కాశ్మీర్‌లో తిరిగి బక్‌షీ మంత్రివర్గం

జమ్మూ కాశ్మీర్‌లలో ముఖ్య మంత్రిగా యిటీవల అక్కడజరిగిన ఎన్నికల ఫలితాన్నిబట్టి బక్‌షీఘులాంమహమ్మద్ నియమించబడ్డారు. అయితే కాశ్మీర్ జాతీయ మహాసభలో విభేదాలు నెలకొని ఆ సభకు ఇంత కాలం ఉపాధ్యక్షుడుగా వున్న శ్రీ జి. ఎం. సాదిక్ మరికొందరు కలిసి పార్టీనుంచి విడిపోయి కొత్త పార్టీని ఏర్పాటు చేసుకొనడం సమైక్యతకు బదులు సందేహాలకే దారితీస్తున్నది.

పటాస్కర్ నివేదిక

ఆంధ్ర మద్రాసు సరిహద్దుల విషయంలో ఏర్పడ్డవివాద పరిష్కారానికి ఇండియా ప్రభుత్వంచే మధ్యవర్తిగా నియమింపబడిన శ్రీ హెచ్. వి. పటాస్కర్, ఆంధ్ర ప్రదేశ్, మద్రాస్ ప్రభుత్వాలతో సంప్రతించి వివాదగ్రస్తప్రాంతాలను సందర్శించిన మీదట కేంద్ర ప్రభుత్వానికి తన నివేదికను అందజేశారు. ఈ నివేదిక రహస్యంగా వుంచబడుతూ వున్నప్పటికి లాఖివర్గాలలో వినవస్తున్న వార్తలను బట్టి తిరుత్తణి మద్రాసుకు ట్రాన్స్‌ఫర్ చెయ్యాలని, చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాట్, చిత్తూరు జిల్లాలలోని కొన్ని సరిహద్దు గ్రామాలను ఆంధ్రకు చేర్చాలని ఆయనసిఫారసు చేసినట్లు తెలుస్తున్నది. మైసూరును మద్రాసు రాష్ట్రంలోనే చేర్చాలని ఆయన సూచించారను కొంటున్నారు.

శ్రీ మోటూరివారికి సన్మానం

30 సంవత్సరాలుగా దక్షిణ భారతావనిలో హిందీ వ్యాప్తికై అనన్యమైన కృషిచేసిన శ్రీ మోటూరి సత్యనారాయణగారినిసన్మానించడానికి జూలై 29 న హైదరాబాద్‌లో జరిగిన మహాసభకు ప్రెసిడెంటు రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహిస్తూ దేశ విస్తృతంగా కార్యక్రమ నిర్వహణకు హిందీభాష వినియోగించడానికి వీలుగా భారతదేశంలోని ప్రతి వక్కరూ హిందీ అభ్యసించే సుదినం త్వరలో రాగలదనే తాను ఆశిస్తున్నానని అన్నారు. ఈ సన్మానోత్సవానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ త్రివేది, డాక్టర్ పట్టాభి సీతారామయ్య, ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగార్లు, ఇతరమంత్రులు, ప్రముఖులు అనేకమంది హాజరైనారు.

జాతీయ వికాసపథకాలు

ద్వితీయ ప్రణాళికా కాలంలోపుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి పూర్తిగా జాతీయ వికాస కార్య క్రమాల్ను (నేషనల్ ఎక్స్‌టెన్‌షన్ సర్వీస్ బ్లాక్సు) విస్తరింపజేయబడగలవని మొత్తం 447 బ్లాకులు ప్రారంభించడానికి కార్యక్రమం రూపొందించబడ్డదని ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్

మంత్రి శ్రీ వి. బి. రాజుగారు హైదరాబాద్‌లో జూలై 29 వ తేదీని ప్రకటించారు.

ఆంధ్రకు కొత్తగవర్నరు

శ్రీ పి. యం. త్రివేదిగారి పదవీ విరమణతో ఆంధ్ర ప్రదేశ్ కొత్తగవర్నర్‌గా నియమించబడిన శ్రీ భీమసేన్ సచార్ ఆగస్టు మొదటి తేదీని రాజభవన్ దర్బారుహాలులో ప్రమాణాలు స్వీకరించారు. మధ్యప్రదేశ్ మాజీగవర్నర్ డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు. ఆంధ్ర ప్రదేశ్ మంత్రులు అనేక మంది ప్రముఖులు హాజరైనారు. శ్రీ సచార్ లోగడ పంజాబ్ ముఖ్యమంత్రిగా వున్నారుకూడా.

శ్రీ దేవదాస్‌గాంధీ మృతి

మహాత్మాగాంధీ కనిష్టకుమారుడు శ్రీ దేవదాస్ గాంధీ గారు ఆగస్టు మూడవ తేది ఉదయం హఠాత్తుగా హృద్రోగంవల్ల మరణించారు.

సాహిత్య అకాడమీ

ఆగస్టు ఏడవ తేదీని ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ ఆంధ్ర సాహిత్య అకాడమీ స్థాపనకు ప్రారంభోత్సవం చేస్తూ దేశంలోని వివిధ భాషలకు ఒకేలిపి దేవనాగరలిపి వినియోగించడంవల్ల ఆయా ప్రాంతాలభాషలను సులభంగా నేర్చుకోనడం సాధ్యమౌతోంది. అన్ని భాషలమధ్య ఒక అనుబంధం ఏర్పడుతోందని అన్నారు.

60 మంది పండితులు. భాషా కోవిదులు అనేక మంది ప్రముఖులు హాజరైన ఈ మహాసభకు ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమసేన సచార్ అధ్యక్షత వహించారు.

శ్రీ సంజీవరెడ్డి. విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావు, తదితరులు ప్రసంగించారు.

తంతి తపాల ఉద్యోగుల సమ్మెవిరమణ

దేశంలోని కేంద్ర ప్రభుత్వోద్యోగులు, తంతి తపాలా శాఖల ఉద్యోగులు ఆగస్టు ఎనిమిది అర్థరాత్రి నుంచి ప్రారంభించడానికి తలపెట్టినసమ్మె, సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ బచ్చు జగన్నాథదాసుగారి నాయకత్వంలో వేతన నిర్ణాయసంఘం తాత్కాలిక సహాయాన్ని గురించికూడా ప్రకటన చెయ్యడానికి అధికారమీయ బడ్డదని ప్రధానిపండిట్ నెహ్రూ ప్రకటించడంతో, మంత్రులతో ముగ్గురు కేంద్ర ప్రభుత్వ ప్రతిపక్ష నాయకులు జరిపిన సంభాషణల ఫలితంగానే విరమించ బడింది.

దీనికిముందు సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం ఎసెన్షియల్ సర్వీసెస్ బిల్లు పేరిట ఒక ఆర్డినెన్సు జారీచేసింది కూడా.

తిరువనంతపురంలో ప్రెసిడెంట్ ప్రసాద్

కొండకు వచ్చి అక్కడి బౌద్ధ శిల్పావశిష్టాలను సందర్శించి ఆగస్టు 10 న కేరళ రాజధాని తిరువనంతపురం వెళ్ళారు. అక్కడ నాలుగు రోజులుండి మద్రాసు మీదుగా ఢిల్లీకి తిరిగి వెళ్ళిపోయారు.

ఆగస్టు 15 : 1857

ఆగస్టు 15 న ఢిల్లీలోను. దేశం అంతటాకూడా భారత స్వాతంత్ర్యదిన దశమ వార్షికోత్సవంతోపాటు 1857 లో జరిగిన తొలి భారత స్వాతంత్ర్య సమర శతవార్షికోత్సవం కూడా మహా వైభవంగా జరపబడింది.

ప్రెసిడెంట్ ప్రసాద్ ఈ సందర్భంలో ఒక సందేశమిస్తూ జాతి శ్రేయస్సుకోసం ప్రతి వ్యక్తి తన స్వీయ సౌఖ్యాలను కొంతవరకు తగ్గించుకొని కృషి చెయ్యాలని ఉద్బోధించారు. ప్రధాని పండిట్ నెహ్రూ ఢిల్లీలో లాల్ ఖిల్లాపై స్వాతంత్ర్య పతాకను ఎగురవేస్తూ 1857 సంవత్సరంపై విప్లవవీరులకు జోహారులర్పించారు. దేశ శ్రేయస్సాధనకే భారతీయులు తమ జీవితాలను అంకితం చెయ్యాలని ఆయన ఉద్ఘోషించారుకూడ.

రైలు ప్రమాదం

పళాసావద్ద కలకత్తాకు వెడుతున్న జనతా ఎక్స్‌ప్రెస్ గూడ్సుట్రాలీతో ఢీకొనడం ఫలితంగా ఆగస్టున సంభవించిన ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు మరణించారు. 17 మంది గాయపడ్డారు.

తిరిగి గోదారివరదలు

భద్రాచలం దగ్గర గోదావరినదిలో తిరిగి వరదలు ఏర్పడ్డాయి. పదివేలయకరాల భూమి జలమయమైంది. పంటలు పాడైనాయి.

పాకీస్థాన్‌పై ఇండియా పుకారు

ఆజాద్ కాశ్మీర్‌లోని మంగళవద్ద ఆనకట్టను నిర్మించడం ద్వారా కాశ్మీర్‌నుంచి జలాన్ని తీసుకుపోవడానికి పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నం తమ మధ్య కాశ్మీర్‌లో యుద్ధ విరమణపై జరిగిన ఒడంబడికలకు భిన్నమని ఇండియా భద్రతాసంఘానికి (మిత్రరాజ్య సమితి) ఫిర్యాదు చేసింది.

విదేశాలలో

పర్షన్ సింధుశాఖ దగ్గిర ఓమన్‌లో ఇమాం తిరుగుబాటును ఎదుర్కొని మస్కాట్ సుల్తానుకు సాయం చేస్తున్న బ్రిటిష్ బలాలు అణిచివేశాయి.

ఆఫ్ఘన్‌స్థానుకు ఆరుకోట్లడాలర్లు అప్పివ్వడానికి రష్యా

మహిళా సమాజాలు

అఖిల భారత మహిళాసభ–సంగంజాగర్లమూడి.

ఆగస్టు 15 వ తేదీన సంగంజాగర్లమూడి మహిళా సమాజంవారు స్వాతంత్ర్య దశమ వార్షికోత్సవములో స్వాతంత్ర్య సమర శత వార్షికోత్సవము జరుపుకొనిరి.

ప్రభాత సమయమున సమాజ సభ్యులు కేంద్రభవనముపై శ్రీమతి పరుచూరి రాజ్యమ్మగారు నాయకత్వాన జాతీయ గీతముతో జండా ప్రతిష్ఠ చేసిరి.

మధ్యాహ్నం 4 గంటలకు బహిరంగసభకు శ్రీమతి పరుచూరి రామచంద్రమ్మగారు అధ్యక్షత వహించిరి.

స్వాతంత్ర్యోద్యమమున స్త్రీల పాత్ర, ఝాన్సీ లక్ష్మీబాయి వీరత్వమును గురించి ఉపన్యాసములు కావింపబడెను.

పిమ్మట పాటలకు సభాసదులకు మిఠాయి పంచబడెను. కార్యదర్శిని వందన సమర్పణతో సభ సమాప్తమయినది.

భారత సేవక సమాజ్ మహిళా శాఖ

పండరీపురం – గుంటూరు.

సొసైటీ ఆక్టు క్రింద 1-6-57 వ తేదీన రిజిష్టరు చేయబడినది. ఈ మహిళాశాఖచే నడుపబడుచున్న వికలాంగుల శరణాలయానికి ఒక ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసి దానికి సంబంధించిన యావదాస్తులను సంఘ బోర్డుకు వ్యవస్థాపకురాలయిన శ్రీమతి ఉప్పల జయప్రదా సాంబశివరావుగారు వప్పగించిరి. ఈ శరణాలయంలో 22 మంది కుంటి బిడ్డలూ, 10 మంది గ్రుడ్డి బిడ్డలూ భోజన వసతి, విద్యాసౌకర్యములను పొందుచున్నారు. ట్రస్టుబోర్డుకు ఈ క్రిందివారిని ఎన్నుకొనిరి.

శ్రీమతి ఉప్పల జయప్రదా సాంబశివరావు (అధ్యక్షురాలు) శ్రీమతి జాగర్లమూడి గంగాచంద్రమౌళి (కార్యదర్శిని) సభ్యులు: శ్రీ కె.సి. మహాలక్ష్మి, శ్రీ పి. సీతమ్మ చౌదరి, శ్రీమతి ఎ. సుశీలాదేవి, శ్రీమతి వెన్నా ముంతమ్మా కృష్ణారావు, శ్రీమతి మద్ది సుందరమ్మా సుబ్బయ్య, శ్రీమతి కె. లక్ష్మీకాంతమ్మ, శ్రీమతి యామినీ దేవి, శ్రీమతి పద్మినీ శివరామయ్య. ఈ సంవత్సరం ఈ శరణాలయాన్ని శ్రీ గుంటూరు ఎన్నవాన సమాజ భవనానికి మార్చిరి.

గోపవరం ప్రేమసమాజం కృషి

సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డువారు 1-1-1957 నుండి 1961 వరకు కుష్ఠురోగుల సేవనిమిత్తం గ్రాంటు చేసిన 1500 రూపాయలతో మరియొక 15 వేల రూపాయలు కలుపుకొని గోపవరం ప్రేమ సమాజంవారు బుర్రకథ, నాటకము మొదలగు ప్రదర్శనముల ద్వారా ధనము వసూలుచేసి మొత్తం 30 వేల రూపాయలతో కుష్ఠురోగుల శరణాలయము స్థాపించి అందు 13 గురుకు పైగా కుష్ఠురోగులను చేర్చి వారికి పోషణ, పథ్యపానాదులు ఒసగి సేవ చేయుట జరుగుచున్నది.



భారతీ సేవా సమాజ్
మహిళా శాఖ — గుంటూరు.


ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో భారతి సేవక సమాజ్, మహిళాశాఖ, గుంటూరువారిచే నడుపబడుచున్న వికలాంగుల పాఠశాలయందు ఉదయం 9 గం॥లకు శ్రీమతి భాన్నసరావుగారు, (జిల్లాజడ్జిగారి సతీమణి) పతాకావిష్కరణ చేసిరి. శ్రీమతి యామినీ దేవిగారు ఇచ్చిన వస్త్రములను శ్రీమతి లక్ష్మీ మాల కొండయ్య (జిల్లా పోలీసు ఆఫీసరుగారి సతీమణి) పాఠశాలయ విద్యార్థినీ విద్యార్థులకు పంచిపెట్టిరి. శ్రీమతి గంగా చంద్రమౌళి 6 ఇనుప పోర్టబుల్ కుర్చీలు, సుమారు 100 రూ.ల ఖరీదుగలవి పాఠశాలయమునకు విరాళము నొసంగిరి, పిల్లలకూ, ఆహ్వానితులకూ, పండ్లు, మిఠా యిలు పంచిపెట్టిరి సాంస్కృతిక కార్యక్రమాలు దిగ్వి జయంగా జరిగాయి.

అనంతపురంజిల్లా గ్రామీణ సంక్షేమ కేంద్రం

15-8-57 తేదిన ప్రజకరూరు సంక్షేమ కేంద్రమందు మహో స్వాతంత్ర్య దినోత్సవం అతివైభవంగా జరుప బడినది. కుమారి సుమ ప్రార్థన గీతముతో కార్యక్రమము ప్రారంభమైనది. ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు శ్రీ శ్రీనివాసాచార్యులుగారు అధ్యక్షత వహించిరి. శ్రీనాది లింగయ్యశాస్త్రిగారు స్వాతంత్ర్య సమరము-జాతీయతను గూర్చియు, పతాక ప్రాముఖ్యమునుగూర్చియు సంక్షిప్తోప న్యాసము గావించిరి. అనంతరం గుత్తి సూపరింటెం డెంటు ఆఫ్ పోలీసు శ్రీ శ్రీరాములుగారు పతాకావిష్క రణము గావించిరి.

ఇరకం ద్వీప గ్రామం

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట తాలూకా ఇరకం ద్వీప గ్రామంలో బాల సంఘమువారు స్వతంత్ర్యదిన మహో త్సవము నేటి ఉదయం 8 గం లకు వైభవంగా జరిపిరి.



ఆరెళ్ళ సూర్యనారాయణరావు మహిళా భవనం విశాఖపట్నమందు గృహ పరిశ్రమలలో నొకటి యైన గవ్వల బొమ్మలు చేయుచున్న క్లబ్బు కార్య నిర్వాహక సభ్యురాండ్రు.

ఎడమనుండి కుడికి: 1. శ్రీమతి పాండ్రంకి వెంకట రమణమ్మ, 2. శ్రీమతి కు. లీలావతి, 3. శ్రీమతి ఎ. పార్వతిబాయి. 4. శ్రీమతి బి. లక్ష్మీబాయి. 5. శ్రీమతి ఎ. సింహాద్రమ్మ. 6. ఎం. [illegible] 8. శ్రీమతి [illegible] వెంకటరమణమ్మ. 9. శ్రీమతి బి. లలితాంబ.

నా ఇంగ్లండు ప్రయాణం

శ్రీమతి ఆర్. రమాబాయి

ఉషాలా ఇంట్లోను కంతము భగవద్గీత పారాయణము చేయుచున్న నన్ను వీధిలోనికి వెళ్ళుటకు ప్రోత్సహించినది. వీధి గుమ్మంలో నా భర్తగారి జాబేమైనను వచ్చునేమోయని ఎదురు చూచుచు నిలబడితిని. పోస్టుమేన్ వరుసగా ఉత్తరములను బట్వాడాచేసుకొనుచు వచ్చి నాకును ఒక పొడుగుపాటి కవరు అందించి వెళ్ళిపోయెను. మొదట అదేమేదో నా మందిగారి ఆఫీసు జాబై యుండునని తలచితిని. తీరా అడ్రసు చూచునప్పటికి అది నాకు రక్షణశాఖ (డిఫెన్సు) వారినుంచి వచ్చినదని తెలిసినది. నాకు చాల భయము కలిగినది. భయముచే చేతులు వణుకుటకు ఆరంభించినవి. సాధారణముగా రక్షణశాఖవారు నావంటివారికి, అంటే, సైన్యంలో పనిచేసేవారి భార్యలకు వారి భర్త అనుగూర్చిన దుర్వార్తలను మాత్రమే తెలిపెదరు. భయపడుచు కవరు విప్పిచదివితిని. ప్రాణము లేచివచ్చినది. భయము మాయమై నెమ్మది కలిగినది. అందులోని విషయము నాకూ, నా అమ్మాయి లిల్లికి యింగ్లండు పోవుటకు టిక్కెట్లు సిద్ధముచేసినారనియు, డిసెంబరు తొమ్మిదిని ('56 వ సంవత్సరం) పడవ బొంబాయినుంచి బయలుదేరుననియు ప్రయాణమునకు తయారు కావలసినదనియు వున్నది. దుర్వార్త కానందుకు దేవునికి వెయ్యి దండములు పెట్టుకొని భోజనమునకు లేచితిని.



రెండు నెలల క్రితం నా భర్తగారిని యింగ్లండునకు పంపియుంచిరి. నేనూ నా అమ్మాయిలూ వేలూరులో నా చెల్లెలి యింటివద్ద వుంటిమి.

భర్తగారివద్దకు, అందులోను ఇంగ్లండునకు వెళ్ళెదను గదా యని సంతోషము ఒకవైపు, మా అమ్మాయిని పట్టుకొని వెళ్ళవలెనుగదా అని ఇంకొకవైపు విచారము కలిగినది. మగ సహాయములేక యిద్దరు పిల్లలతో ఒంటరిగా ప్రయాణము, అందులోను ముఫైరోజులకు పైగా ఎలాగో అనే భయమువల్లను తికమకలగుచు ఏమీ తోచక పదిహేను రోజులు గడిపివేసితిని.

ఇండియాలోనే చేయు ప్రయాణముల తీరు వేరు. ఈ విదేశ ప్రయాణము వేరు. పాస్‌పోర్టులు, హెల్త్ సర్టిఫికెట్లు మొదలైన అదనపు కష్టములు ఎక్కువ. ఈ పాస్‌పోర్టులు వగైరాలు తీసుకొనడానికే సతమతమౌతున్న నాకు సూయెజ్ యుద్ధం ఒకటి వచ్చిపడింది. ఇక నా భయము వర్ణనాతీతము. అంత భయముగావున్న ప్రయాణము ఆపి ఏ అమ్మమ్మగారి అండనో సుఖముగా కాలము గడపరాదా అని అడిగెదరా? దానికిసీ అసమర్థురాలనై వుంటిని. తీరా టిక్కెట్టుఏర్పాట్లు జరిగిన తరువాత అకారణముగా ప్రయాణము ఆపు చేసినచో నష్టపరిహారము ఇచ్చుకొనవలెను. తీరా వుండలేక నాలుగైదు వేల రూపాయలు హారతి కర్పూరము చేయుటకు మనస్సొప్పలేదు. అష్టకష్టములతో కూడియుండుననుకొన్న ప్రయాణము నచ్చలేదు. ఏమిచేయుటకును తోచక ఇరవై అయిదు రోజులు గడచిపోయినవి. ప్రయాణము సమీపించినది. గనుక ఇష్టములేకున్నను మూటముల్లె కట్టి ప్రయాణమునకు సిద్ధముగావుంటిని. ఇక రెండు రోజులలో బయలుదేరవలెనని వున్నప్పుడు మరల తెలియపరచుటకు ప్రయాణము ఆపవలయుననియు సూయెజ్ యుద్ధం గడచినతరువాత పడవ బయలుదేరు తారీఖు పోస్టుపోన్

చేయబడినదనియు తెలిపిరి. తాత్కాలికమైనను ప్రయాణము ఆగినందులకు కొంత తృప్తి పడ్డాను.

వారము, పదిరోజులు గడిచినవి. చాకలి బట్టలు పూర్తిగా మైలపడినవి. పప్పు బియ్యము ఖర్చయినవి. ప్రయాణమునకు నా చెల్లెలు వండించి పెట్టిన ఫలహారములు మాయమైనవి. డిసెంబరు రెండవ వారములో వారమురోజులలో బయలుదేరవలెనన్న వార్త అందినది. పూర్తిగా విసుగు చికాకు. మద్రాసు బయలుదేరితిని.

మద్రాసు మిలిటరీ హాస్పిటల్‌లో మాకు ఆరోగ్య పరీక్ష చేసిరి. అనగా గుండె, కళ్ళు, ముక్కు, చెవి ఒకటేమిటి సర్వావయములు ఆరోగ్యముగా వున్నవా, దీర్ఘవ్యాధులు లేక అని స్పెషలిస్టులచే పరీక్షింపబడితిమి. మా ఆరోగ్యము ఇంగ్లండులోని శీతోష్ణపరిస్థితులను ఆదుకొనగలదనియు, మేము పూర్ణారోగ్యముగా వున్నామనియు సర్టిఫికేటు ఇచ్చిరి. తరువాత టీకాలు, కాలరా, ప్లేగు, టి.ఏ.బి. ఇనాకులేషన్‌లు చేసిరి. రెండవది పాస్ పోర్టు. ఇది నాకంత కష్టముకాలేదు. ఒకరోజు పని. మూడవది డబ్బు మారకము. ఇది లాయిడ్ బ్యాంకు ద్వారాగాని తామస్‌కుక్కు కంపెనీ ద్వారాగాని చేసుకొనవచ్చును. మన రూపాయలకు పౌన్లుగాగాని, ప్రయాణికుల చెక్కులుగాగాని ఇచ్చెదరు ఈడబ్బు మార్చినందులకు వారికి కొంత కమిషన్ (నూటికి ఒకరూపాయ) ఇవ్వవలెను. డబ్బుగూడ ఇష్టమొచ్చినంతగాక 175 పౌనులు మాత్రము మాతో తీసుకొనిపోవచ్చును. నాలుగవది. రిజర్వుబ్యాంకు అధికారులతో, మేము మాతో ఎంత విలువగల వెండి, బంగారం, రాళ్ళు (వజ్రములువగైరా) తీసుకొనిపోవుచున్నామో తెలిపి వాటిని తీసుకొనిపోవుటకు మరలా వాటిని మాతో వాపసు తెచ్చుకొనుటకు అనుమతి పత్రము పొందవలెను. మన పాతనగలకు ధరలనుకట్టుట వగైరాకొంత శ్రమే. ఈనాలుగు పనులు నాలుగు రోజులలో ముగించుకొని, రైల్వేరిజర్వేషన్ వగైరా పనులు పూర్తిచేసుకొని 25 తేదీన బయలుదేరి బొంబాయి 26 చేరితిని. అచ్చట మరల మా సామానుల జాబిత, ఒక్కొక్క పెట్టెలో ఏమేమి వస్తువులున్నవో సరియైన పట్టి తయారుచేసి, సామాను యిన్స్యూర్‌చేసి, వాటిని 27 ప్రొద్దున డాకుకు తీసుకొని పోయితిమి. అచ్చట ఎగుమతి సుంకము చెల్లించి పడవ ఏజంట్లకు సామాను అప్పచెప్పి ఇంటికి వెళ్ళితిని. తరువాత మేము షిప్పులో 2 గం కూర్చొన వలసియుండెను గనుక 1½ గం ఇల్లు బయలుదేరి వెళ్ళితిమి. డాక్‌లో మరల 1 గంట పని. అనగా కస్టమ్సు వారి తనిఖీ. షిప్పువారు టికెట్లువగైరాలను సరి చూపడమున్నూ. హెల్తు సర్టిఫికెట్సు తనిఖీ వగైరాలయి సుమారు 3 గం పడవలో ఎక్కితిమి. పడవలో నన్ను దిగబెట్టుటకు వచ్చిన మాబాబు (కుమారుడు) బంధువు ఒకాయనా 4½ గం వరకువుండిరి. జన్మభూమిని, కుమారుని విడిచి పోవలెనన్న దుఃఖము ఎక్కువైనది 5 గం లోపున చూడవచ్చిన వారందరూ వెళ్ళిపోవలసియుండెను అందరికి గుడ్‌బై చెప్పి కూర్చుంటిని 5 గం షిప్పు బయలుదేరినది. మా అమ్మాయిలు ఏమి చేయుచుండిరో గాని నాకు మాత్రము తేరుకొను నప్పటికి పడవ రేవు విడిచి చాలా దూరము వెళ్ళియుండెను. బొంబాయి పట్టణము మరి కనిపించలేదు.

నేను ప్రయాణము చేసిన షిప్పుపేరు యం. యస్. బేటరీ. దీనియందు ఫస్టుక్లాసు టూరిస్టుక్లాసు గలవు. దాదాపు రెండువేల మంది ప్రయాణము చేయవచ్చును. పడవ సిబ్బందిగాక, నాకు ఫస్టుక్లాసులో రెండు కాబినులు ఇచ్చి యుండిరి. ఒక్కొక్క కేబిన్‌లోను మంచము, పడక, కంబళ్ళు సరిపడా వున్నవి. ఒకబల్ల, కుర్చి, అల్మారా వున్నాయి. వాష్ బేసిన్ అద్దము, వగైరాలు వున్నాయి. సముద్రపు వైపునకు ఒక కిటికీ వున్నది. అతి శుభ్రముగా అన్ని సదుపాయములు కలిగి యుండెను. ఈ చిన్ని గదులు ఒకరు ఇద్దరూ, ముగ్గురూ నివశించుటకు అనువుగా వుండును. కుటుంబములను అనుసరించి ఇవ్వబడును. మరుగుదొడ్లు, స్నానపు గదులు, భోజనపు హాలువేరు. కొన్నేసిగదులకు, మగ, ఆడ, పనిమనుష్యులు వుండెదరు. వారు ప్రయాణీకులకు ఏమి కావలసినను చేసి పెట్టెదరు. మరియు గదుల శుభ్రపరచుట, పక్కలు వేయుట మొదలైన పనులు చేసెదరు.

షిప్పులో ఒక ఆస్పత్రిడాక్టరు, క్షౌరశాల, బట్టలలాండ్రి చిన్నపిల్లలబండీ లైబ్రేరీ, ఒక టాయిలెట్ సామాన్లు అమ్మే షాపు కూడ వుండెను.

నావ పైభాగములో బాడ్‌మింటన్, టేబుల్‌టెన్నిసు బాస్‌కట్టుబాల్, మొదలైన ఆట ప్రదేశములు, పేక, చదరంగము, మొదలైన ఆటలాడుటకు గదులు వుండును. ఒక పెద్ద శుభ్రమైన స్విమ్మింగుపూల్ (యీదుటకు) వుంది. దీనిలోచలికాలమందు వేడినీళ్ళు, ఎండకాలములో చల్లనీళ్ళు నింపెదరు. పడవ అంచులలో వరండాలు వుండును. వాటిలో పడక కుర్చీలు ఉంటాయి. ఇచ్చట హాయిగా కూర్చొనుటగాని, పచారు చేయుటగాని చేయ

వచ్చును. అన్ని సదుపాయములు గలిగి సాంసారికమైన ఇబ్బందులులేక రకరకాల నాజూకైన సహప్రయాణీకులతో సముద్రప్రయాణము చాలా హాయిగా వుండెను,

సుమారు వెయ్యిమందికూర్చొనగల భోజనశాల అతి శుభ్రముగా నుండును. ప్రతి కుటుంబమునకును వేరు వేరు బల్లలు ఇచ్చెదరు. పిల్లలకు 6 గం భోజనము, పెద్దలకు 7½ గం లకు. తినుటకు పళ్ళెములు మొదలైనవి చాలా విలువైనవి, కత్తులూ, చంచాలూ, ముళ్ళూ వెండివి, గోడలకు పెయింటింగ్‌లు, రంగు రంగుల దీపములు చాలా అందముగా వుండెను. శాఖాహారము, మాంసాహారము కూడా దొరుకును. 4, 5, రకముల పళ్ళు, కూరగాయలు, వెన్న, పాలు, సమృద్ధిగా వుండును. అన్నము, చపాతీలు, పూరీలు, కిచిడి (పులగము) అప్పడములు మొదలైనవి కూడా వుండెను. రాత్రి 9 గం సినిమా, బాల్‌డాన్స్ సంగీతము, మొదలైన వినోదములు పదకొండు గంటలలువరకూ వుండును. ఇవన్నియు వేరే టిక్కట్టు కొనుక్కోకుండానే వోపిక వున్న అనుభవించ వచ్చును.

పడవ బయలుదేరిన దినమే పడవ యజమానులు ఏమైనను ఆపదకలిగిన పడవనుంచి ఏవిధముగాతప్పించుకొనవలెనో ప్రయాణీకుల కందరికి బోధించెను. అపాయము సంభవించునప్పుడు, ప్రాణరక్షణకై చిన్న నావలలో ఎక్కుటకు మార్గము, ధరించవలసిన బట్టలు, ఇవి ప్రత్యేకము గాలితోనింపబడి నీటియందుతేల్చుటకనువుగా కుట్టివుంచెదరు) మొదలైన విషయములు ప్రతిప్రయాణీకుడు, పిల్లలతోసహా, పూర్తిగా తెలుసుకొని వుండవలెను

పడవలో పనిచేయువారు చాలామంచివారు. ప్రయాణీకుల సదుపాయములు ఎప్పటికప్పుడుగమనించుచుందురు షిప్‌లో పర్సర్ అని ఒక వుద్యోగి వుండును. ప్రయాణీకులు తమతమ విలువగల వస్తువులు ఇతనివద్ద దాచుకొనవచ్చును. మరియు డబ్బు నానాదేశముల కరెన్సీలలో మార్చుకొనవచ్చును. చాలా అవసరమైన విషయములుండిన రేడియోద్వారా మన బంధువులకు తెలుపుకొనవచ్చును. దీనికి 1 మాటకు రెండుషిల్లింగులు (రూపాయిన్నర)

జనవరి 7 తా మా పడవ కేప్ ఆఫ్ గుడ్‌హోప్ చేరినది ఇది దక్షిణాఫ్రికా రాజ్యము. ఇచ్చట మా పడవ పూర్తిగా 6 దినములు ఆగెను. నేనూ మరి కొందరు ప్రయాణీకులు కలసి వూరు చూచుటకు వెళ్ళితిమి. నల్లవారు అచ్చట కొన్ని ప్రదేశములు మాత్రమే చూడవచ్చును. కేప్ నగరము చాలా అందమైనదని వినికిడి. గాని మేము చూచిన ప్రదేశములు మాత్రం చాలా చాలా అసహ్యముగా. వుండెను. దిగిన తప్పుకు దినముపూరా చుట్టిచుట్టి సాయంకాలము 6 గంటలకు పడవ ఎక్కితిమి సౌతాఫ్రికా దొరతనము, నల్ల ప్రజలను ఎంత నికృష్టముగా ఇప్పటికినీ చూచుచున్నదో ఈ స్వల్ప కాలమందే గ్రహింప గలిగితిని. మా పడవ దర్బాన్ రేవులో ఆగక పోవుట చాలా మంచిదైనది-

8 తా బయలుదేరెను. మా పడవ రోజునకు 350, 400 మైళ్ళ వేగములో నడచు చుండెను. 20 "మధిర" అను ఒక పోర్చుగీసు దీవి చేరితిమి. అచ్చటివారు దక్షిణాఫ్రికనుల కంటెను రెండాకులు ఎక్కువ చదివినవారు. షిప్పును పూరా రేవునకును రానివ్వలేదు. కొంత దూరములో ఆపి తెల్లవారిని మాత్రము వూరుచూచుటకు చిన్న చిన్న పడవలమీద తీసుకొనిపోయి తిరిగితెచ్చి విడిచిరి.

జనవరి 27తేని సౌతేంప్టన్ చేరుననుకొన్న మా పడవ దర్బాను, మధిర. లాస్‌పర్మాసు, అను మూడు రేవులలో ఆగక పోవడంచే 23 సాయంకాలమే ఇంగ్లాండుచేరినది. 4 గంటలే అయినను, కనుచీకటిగా వుండెను. నా భర్తగారు మమ్ములను ఎదుర్కొనుటకు ఇచ్చటికి వచ్చియుండిరి. చలి మరీ ఎక్కువ. కష్టమ్సు తనిఖీ చేయబడిన తరువాత మా సామానులు బేగేజ్ ఏజెంట్సుకు వప్పజెప్పి రైలు ఎక్కుటకు 6 గం అయినది. 30, 30, డిగ్రీలు, చాలాచలిగా వుండెను. కానిరైలులో కూర్చున్న తరువాత వేడిగా వుండెను. (ఇచ్చట రైళ్ళలోను, బస్సులలోను. స్టీము నింపి వెచ్చగా నుంచెదరు) మా వూరు వాచ్‌ఫీల్డు 60 మైళ్ళ దూరము. గాని మూడుచోట్ల రైలు మారి 10 మైళ్ళు బస్సులో పోవలెను. ఇండియాలో వలె త్రూ రైళ్ళు లేవు. రాత్రి 10 గం, రక్తము గడ్డకట్టు చలిలో ఇల్లు చేరితిమి.

ఇచ్చటి అనుభవములు: మా ఇల్లుమిలటరీక్వార్టర్స్‌లో ఇండియాలో కంటెను శుభ్రముగాను. మంచిసామానులు గలిగివున్నది. ఇచ్చట మిలిటరీ కాలేజి వుంది. ఈ కాలేజీలో విద్యాభ్యాసము చేయు మిలిటరీ ఆఫీసర్సు ఇచ్చట వుపాధ్యాయులుగా వున్న ఆఫీసరుతప్ప మరెవరునులేరు. సుమారు 1000 ఒకే రకములైన ఇండ్లు కాలేజి తప్ప ఇంకేమియు లేదు. నిత్యజీవితావసరమైన ఆహార పదార్థములు సప్లయి చేయబడును. మరేదైన షాపింగ్ చేయవలెనన్న 10 మైళ్ళ దూరములో

నకు పోవలెను. మరుదినము అనగా జనవరి 24 తే నుంచి నా యు. కె. జీవితము ఆరంభమైనది.

ప్రొద్దునలేచి బయట కిటికీ ద్వారా చూచితిని. రోడ్లు మంచుతో కప్పబడివున్నాయి. పొగమంచువల్ల పదిగజాల దూరాన్న వస్తువు కనుపించలేదు. ఇంతచలికి ఆదుకొన బట్టలు మాకు లేకుండెను. ఇచ్చట ప్రతి ఇంటియందును "ఫైర్‌ప్లేసెస్" వుండును. రైలు బొగ్గులను మంటవేసి ఇంటిని వెచ్చగా, బ్రతుకుటకు కావలసిన వుష్ణములో వుంచుకొనవలెను. తరువాత ఒక్కొక్కపని ఆరంభించితిని. మొదట కావలసిన బట్టలు మా కందరికి కొంటిమి. నాలుగైదు రోజులు ఏలాగో గడచినవి. ఇంక నిత్య కృత్యములు సాఫీగ జరుగుటకు ఏర్పాట్లు చేసుకొనవలసి యుండెను. ఇచ్చట ఎవరింటి పనులు వారే చేసుకొనవలెను. నౌకర్లనేవారు ఇచ్చట ఎవరునులేరు. ఇంటి పనులన్నియు అనగా అంట్లు చెంబులు తోముకొనుట, ఇల్లు తుడుచుకొనుట. పొయ్యి శుభ్రముచేయుట, వంటచేయుట చాకలిపని, పాకీపని సర్వము చేసుకొనవలెను. అలవాటు లేనికారణము నాకు ఒక్కొక్క పనియు చాలా కష్టమనిపించినది. దీనికితోడు ఎముకలు కొరికే చలి అలవాటు పడిన నెయ్యి. కూరగాయలు పెరుగు మొదలైనవి లేవు. తిండి సరిగాలేక. ఎక్కువ పనివల్ల, వళ్ళు నొప్పులు, చీకాకు ఎక్కువైనది. నాబాధ చూడలేక మా ఆయన గారికి మనోబాధ, ఇది ఎందుకొచ్చిన కాపురమా అనిపించే పర్యంతము వచ్చినది. 4 గం సాయంకాల మయే టప్పటికి మా అమ్మాయిలు భోజనము సరిగా బడిలో చేయక ముఖము ముడుచుకొని తయారు. మా ఇంటికి బడి దూరముగనుక ప్రొద్దున 8 గం పోయి 4 గం తిరిగి వచ్చెదరు. ఇండియాలోని కాన్వెంటుల వలెనే ఇచ్చటను మధ్యాహ్న భోజనవసతులు వున్నవి. ఒక నెల రోజులు గడిచినవి. ఇంతపని ఇచ్చట దొరసానులు ఎలాగు చేసుకొను చున్నారో తెలుసుకొన వలెనని పక్కింటికి పోయితిని. ఈయన ఒక బ్రిటిష్ ఆర్మీకెప్టెన్. ఆయనభార్య చాలా గౌరవముగానే మాటలాడినది. వివాహమై 2 సం అయినదనియు 10 మాసముల బిడ్డ కలదనియు మరల 5 నెలల కడుపు అనియు చెప్పినది. ఒంటి దానివి ఇంటి పనులన్నియు ఏలాగు చేసుకొనుచున్నావమ్మ అని అడిగితిని. ఈ ఇల్లాలు చాలా అమాయకముగా జవాబు చెప్పినది. ఏమనగా "ఏమి చేయుదుము స్వతంత్ర దేశమైన బ్రిటన్‌లో నౌకర్లెవరుందురు? మా తండ్రిగారు జర్మనీలో (యుద్ధా నంతరము) వున్నారు. వారికి ఇద్దరు నౌకర్లు, మా తాతగారు ఇండియాలో వుండిరి. వారు ఆరుగురు. నౌకర్లచే దినము రాత్రి కూడా సేవల నందుకుంటారు. అలాటివారు ఇచ్చటలేరు. బీదలైనను మా దేశప్రజలను మాపనులకొరకు ఉపయోగించుకొనలేముగదా" అనిచెప్పినది. ఈమాటలు వినునప్పటికే నాకు ఎచ్చటలేని ఆలోచనలు బయలుదేరినవి. మా మనోవృత్తికి వీరి మనోవృత్తికి ఎంత వ్యత్యాసము. ఇండియాలో దొరతనము చలాయించిన దొరసానలకు ఇచ్చటి వారికి ఎంత భేదము. పదేశి నౌకర్లచే ఇంటి పనులు చేయించుకొన్న దొరసానులు ఇచ్చట ప్రొద్దస్తమానము చేతులరిగిపోవునట్లు పనిచేసుకొనుచున్నారే

వారము రోజులు గడిపి మరొక ఇంటికి వెళ్ళితిని. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. ఇల్లు అతి శుభ్రముగా వుండెను. బట్టలు మల్లె పూవులవలె వుదికి ఇస్త్రీ చేయుచుండెను. ఏ వస్తువుచూచినను అతి శుభ్రముగా తళతళ మెరియుచు కనుపించినవి. తోటలో మంచిమంచి పువ్వులు వెనుక భాగములో కొన్ని కూరగాయల మొక్కలు. ముద్దొచ్చే తెల్లటి కుక్కపిల్ల. ఈమెతో నేను "నీ ఇల్లు చాలా బాగుగా వున్నది. నీవు ఇంటి పనులలో చతురురాలవుగా వున్నావు" అని అడిగితిని దీనికి ఈమె చెప్పిన జవాబు "ఈమాత్రము ఇంటి పనులు చేసుకోనేరనమ్మ వివాహమెందుకు చేసుకొనవలెను? దీనిలో ఏమి గొప్ప" అని ఎదురు ప్రశ్నవేసినది.

కొన్ని రోజులకు తరువాత ఇంటి దగ్గరలో వుండు ఒకామె నన్ను కాఫీ పార్టీకి పిలిచినది. అచ్చట నేనుగాక 4 5 గురు గృహిణులువచ్చియుండిరి. నేనుగాక ఇచ్చట వుండు వారందరు ఇంగ్లీషు వారేఅని మరువకుడు. ఈ ఇల్లుకూడా అతి శుభ్రముగా వుండెను. ఇంతబాగా ప్రతి వస్తువు, గోడలు, తలుపులు కిటికీ అద్దములు మొదలు తళతళలాడునట్లు ఏలాగు చేయుదురా అను ఆశ్చర్యము. అడిగిన నామంకు తనము బయలు పడుననే భయము వల్లను యోజించి వూరకుంటిని. కొన్ని రోజులతరువాత గుడ్‌హౌస్ కీపింగ్ ఇనిస్టిట్యూషన్ అని లండన్‌లో ఒకటి వున్నట్లు పేపర్లో చదివితిని. మరికొన్ని దినముల తరువాత ఒక గృహిణితో పై ఇనిస్టిట్యూషన్ గురించి వాకబుచేసితిని. ఆమె ఈ సంస్థచే ప్రకటింపబడే మాసపత్రికలు తనవద్ద వున్నవనియు అవి చదువవలసిన దిగా చెప్పిఇచ్చినది. దీనివిషయము ముందు వ్యాసములో తెలిపెదను.

★



బాలరాజ్యం

★ రాజు బాబు ★

శ్రీ బి. వి. నరసింహారావు బి.ఎ, బి.ఇ.డి.

రాజుబాబు రాకకోసం మా బడి పిల్లలందరూ తహతహలాడుతున్నారు. ఆడపిల్లలు మరీ ఆదుర్దాగావున్నారు ఎప్పుడు రాజుబాబు వస్తాడా. ఎంచక్కా అతని ముద్దు మాటలు విందామా అనుకుంటూ.

ముప్ఫైమైళ్ళ దూరంనుంచి రావాలి మరి రాజుబాబు. అంత దూరానవుంది వాళ్ళవూరు మాకు. రాజుబాబు వాళ్ళ రామయ్య పంతులతో కలిసి. బస్సుమీద వస్తున్నట్లు మాకు ముందుగానే వుత్తరం వచ్చింది. అంతా ఎదురు చూస్తున్నాం.

రామయ్య పంతులు రాజుబాబుకి చదువుచెప్పే గురువు రాజుబాబు వూరుకి. రామయ్య పంతులు చదువుచెప్పే వూరుకి రెండు మైళ్ళు. పిల్లలకి చక్కగా చదువుచెప్పే వాళ్ళని తయారుచేయడంలో రామయ్యపంతులు చాలా గట్టివాడు. ఆసంగతి తెలిసి రాజుబాబుని, వాళ్ళ తలిదండ్రులు దూరమనకుండా చదువుకి, రామయ్యపంతులు దగ్గరికే పంపిస్తున్నారు. కొడుకు బాధ్యతంతా పంతులుకే వదలిపెట్టి. ఏదికావాలంటే అది. పిల్లవానికోసం వారు. ఏర్పాటుచేసి పెడుతున్నారు.

రాజు బాబుని గురించి నేను మొట్టమొదటిగా తెలుసుకొన్నది రామయ్య పంతులు నాకు వ్రాసిన వుత్తరాన్నిబట్టి. అందులో రామయ్యపంతులు బాబుని గురించి బహు వివరంగా వ్రాశాడు. పైగా "మీగురించి ఎక్కువగా విన్నాను. పిల్లలవిషయంలో మీరు పెద్దకృషి చేస్తున్నారట. నాదగ్గర ఒక ఆరు సంవత్సరాల వయసు కుర్రవాడున్నాడు చాలా చురుకైనవాడు. వయసుకు మించిన ఊహలున్నవాడు. అన్ని సంగతులు అట్టే అవలీలగా గ్రహించి బ్రహ్మాండమైన ప్రశ్నలవర్షం కురిపిస్తాడు. వాటికి సమాధానం చెప్పడం నాబోటి వాని శక్తికి మించినపని అవుతోంది. ఆ అబ్బాయి ఒక సిరిగలవారి ఏకైక పుత్రుడు. ఎలాగైనా మంచి అభివృద్ధిలోకి తేవలసినదని వారి తలిదండ్రులు నాకు ఒప్పగించారు. ఆ కుర్రవాని విషయంలో నన్నేమి చెయ్యమంటారు ?" అని వ్రాశాడు.

ఆ వుత్తరం చదివేటప్పటికి నాకు చెప్పలేని ఆనందం కలిగింది. 'ప్రశ్న లడగడం పిల్లల్లో ఒక శుభ లక్షణం' అన్న సత్యాన్ని ఈ బడుగు పంతులు కనిపెట్టగలిగాడు కదా అని గర్వంకూడ కలిగింది. "తప్పకుండా అలాంటి

కుర్రవాణ్ణి త్వరలో ఒకసారి చూస్తాను. నాకు తోచిన సలహా చెపుతాను." అని పంతులికి తిరుగు జవాబువ్రాశా.

నాకూ రామయ్యపంతులుకీ ఇంతకుపూర్వం ఏమాత్రం పరిచయమూ లేదు. ఈ వుత్తరాలే మమ్మల్ని ఎంతో దగ్గరకు చేర్చాయి. విలువైన బాల మనస్తత్వ పరిశోధనకు నాకు మంచి అవకాశాన్నిచ్చాయి.

నా వుత్తరం అందిందే తడవుగా రామయ్యపంతులు తిరిగి నాకొక వుత్తరం వ్రాశాడు — "అయ్యా! శుభస్య శీఘ్రమన్నారు! మా రాజుబాబుని రేపే మీ దర్శనార్థం బస్సుమీద తీసుకొస్తున్నా. మిమ్మల్నీ చూడాలని మా బాబుకూడా ఎంతో తొందర చేస్తున్నాడు. వారి తలిదండ్రులు కూడ పంపడానికి అంగీకరించారు. ఇంతవర కెన్నడూ తలిదండ్రుల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళని బాబు ఎందుకో మీ తావుకి ప్రయాణమంటే ఉబలాటపడుతున్నాడు." అంటూ.

ఈ వుత్తరాలసంగతి, రాజుబాబు విషయం, మా బడిపిల్లలకు విడమర్చి చెప్పాను. అలాంటి కుర్రవాణ్ణి తప్పకుండా చూడాలన్న కుతూహలం వాళ్ళందరిలో పెరిగింది.

మరునాడు మా పిల్లలంతా బస్సు ఎప్పుడు వస్తుందా బడి కెదురుగా రోడ్డు మీద ఎప్పుడు నిలుస్తుందా, అందులోంచి అమాంతంగా రాజుబాబు దిగివచ్చి అందరికీ ఎప్పుడు ఆనంద మిస్తాడా,—అని గుటకలు మ్రింగుతూ ఎదురుచూస్తున్నారు.

బస్సు వచ్చింది. బడి కెదురుగా ఆగింది. రాజుబాబు, రామయ్యపంతులు అందులోనుంచి దిగారు. బాబుది బంగారుఛాయ. నవ్వుమొగం. అతని నడక ఠీవి. హేటు, బూటు, బుష్‌కోటు—పల్లెటూరి పేదపిల్లలకు వింతగా విలువగా కనబడినాయి. రామయ్యపంతులు గంపెడు సామగ్రితో—రెండు సంచులనిండా పుస్తకాలు, వింతవస్తువులు, ఒక తాటాకు బుట్టనిండా మామిడిపళ్ళు, చంకలో గొడుగుతో సిద్ధమైనాడు. వచ్చినవారి నిట్టే పోల్చుకోగలిగాము. ఎందుకంటే, వారి రూపాలు మా మనోదృష్టి కిదివరకే పరిచయం.

రావడంతోనే రామయ్యపంతులు నాకు గౌరవ వందనం చేశాడు. రాజు బాబున్నూ "నమస్కారమండీ" అన్నాడు నన్నెరిగినట్టు. వచ్చినవారిని చుట్టుముట్టారు వింతగా, ప్రేమగా, చూస్తూ పిల్లలు.

అందరినీ ఎవరి స్థలాల్లో వారిని కూర్చోబెట్టి, వచ్చిన అతిథులను కుశలప్రశ్నలువేసి మర్యాద చేశాం. అందరూ కూర్చున్న తరవాత రాజుబాబు తెచ్చిన మామిడిపళ్ళు ముక్కలుగాకోసి, అతని రాకకు సూచకంగా అందరికీ పంచిపెట్టాం. బాబు తెచ్చిన పుస్తకాలు, వింతవస్తువులు, మావాళ్ళంతా పరిశీలనగా చూడసాగారు. కొత్తంటూ లేకుండా వచ్చినక్షణంనుంచీ రాజుబాబు వాళ్ళందరిలో కలిసిపోయాడు. అరమరికలేకుండా అందరితో చనువుగా మాట్లాడడం, అడిగిన ప్రతి ఒక్కరికీ అందంగా జవాబు తడుముకోకుండా చెప్పడం మాకు ముచ్చట కలిగించింది. నాదగ్గరకువచ్చి బాబు "ఏమండీ! మీకు పిల్లలంటే సంబర మంటగా?" అని ఎవరో చెప్పినట్టు అడిగాడు. ఆమాట వినేసరికి నాకు ఒళ్ళంతా ఒక్కసారి పులకరించింది. బాబుని అమాంతంగా ఎత్తుకుని ముద్దాడాను.

ఆదినం రెండు పూటలు బాబు బళ్లో బాలబాలికలందరితో బహు వుత్సాహంగా గడిపాడు. అందరినీ వాళ్ళవూరు రమ్మని ఆహ్వానించాడు. "మీవూరు వస్తే ఏంపెడతావు బాబూ?" అంటే, మామిడి పళ్ళు, పూతరేకులు పెడతా" నన్నాడు. చిరిగిన లాగూ చొక్కా తొడుగుకున్న ఒక కుర్రవాణ్ణిచూసి బాబు "ఆ అబ్బాయికి మంచి డ్రస్సు కొనుక్కోడానికి డబ్బులేదా పాపం? వాళ్ళు బీదవాళ్ళా?" అన్నాడు. "నువ్వు వాడికి లాగూ చొక్కాలూ కొనిపెడతావా?" అంటే "మావూరు వస్తే మా నాన్నగారితోచెప్పి కొనిపెడతా" నన్నాడు. "మీ వూరు రావడానికి వాడికి డబ్బులేదుగా" అంటే "మా అమ్మగారిచ్చిన పదిరూపాయ లున్నాయిగా, వాడికి టిక్కెట్టు కొంటాను" అన్నాడు మోతుబరిగా.

మరొక పిల్లను చూసి "ఏం ఆ అమ్మాయి అలా బెంగతో వుంది ఎందుకు? దానికి పాఠం రాలేదా? పంతులుగారు కోప్పడ్డారా?" అన్నాడు బాబు. నిజంగా ఆ అమ్మాయి సంగతి తెలిసి అన్నాడాబాబు అనిమాకు అనుమానం, ఆశ్చర్యం కలిగాయి. రామయ్య పంతులు వుత్తరంలో వ్రాసింది అక్షరాల నిజమన్నట్లు రుజువయింది మాకు బాబు విషయం.

బాబు తెచ్చిన బొమ్మల్ల సినిమా పిల్లలంతా తొక్కిసలాడుతూ చూస్తుంటే "ఎందుకలా తోసుకుంటారు? ఒకొక్కళ్ళే చూడరాదా మెల్లగా?" అన్నాడు ఎంతో ఆరిందాగా.

బాబు తెలివి తేటలకు ముద్దుగొలిపే మాటలకి, మర్యాద మన్ననలకి మాపిల్లలంతా ముగ్ధులైనారు. ధరిం

చిన దుస్తులు మాయకుండా, మణగకుండా పరిశుభ్రంగా వుంచుకొన్న బాబుతీరు మాపిల్లలకొక చల్లని గుణపాఠ మయింది.

సాయంకాలం బాబు గౌరవార్థం మా పిల్లలు ఒక ఉల్లాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్షులుగా రామయ్య పంతుల్నే కోరి వుంచారు.

జాతీయ గీతంతో కార్యక్రమం ప్రారంభమయింది. మొదట సాంస్కృతిక మంత్రిణి అతిథులకు ఆహ్వానం గౌరవం క్లుప్తంగా తెలిపింది. సుశీలాదేవి. 'మేంబాలలం' అన్న ఉపన్యాసాన్ని, శాస్త్రి "మహోపన్యాసం" ఇచ్చారు. కృష్ణకుమారి వెనక చిన్నకొప్పు, ముఖాన పెద్దబొట్టు, చంకలో ఒక తట్టతో తయారై వచ్చి జానపద నృత్యం చేసింది. తరవాత ఆరుగురు మగపిల్లలు—

పల్లెటూరి పిల్లలండి మేము. మా
వల్లగాదటంచు చెప్పబోము
చెట్టులెక్కగలము, పెద్ద
గట్టులెక్కగలము మేము
పట్టుదలకు వస్తె ఎంతో
పెట్టినది పేరు మేము
మోసములకు దోసములకు
దాసులమే మసలు కాము
రోసమంటె మాదె సొమ్ము
కాసుకుపై గురుతుసుమ్ము ॥

అని పాడుతూ అతిచురుకుగా, ఉత్సాహంగా నాట్యం చేశారు. కొందరు బాలగీతాలు కూడా పాడారు. ఈ పాటలకు, ఆటలకు వంతవాక్యాలన్నీ బాలబాలికలే నిర్వహించారు.

రాజుబాబు, రామయ్యపంతులు, ప్రదర్శనలన్నీ రెప్ప వాల్చకుండా చూశారు. చాలా సంతోషించారు. చివరికి అధ్యక్షుడు బాలలందరినీ ప్రశంసించి, ఆశీర్వదించాడు. కొన్ని హితవచనాలు బాలలకందించాడు. ఒకసారి వచ్చి వాళ్ళ బడిని పిల్లలని చూడవలసిందని, వాళ్ళకు తమ ప్రదర్శనలతో సంతోషాన్ని కలిగించవలసిందని కోరాడు. వందనసమర్పణ, జనగణమన గీతంతో కార్య క్రమం దిగ్విజయంగా పూర్తి అయింది.

మరునాడు ఉదయం భోజనానంతరం రాజుబాబు, రామయ్య పంతులుతో వాళ్ళ గ్రామానికి తిరుగు ప్రయాణ మైనాడు. వచ్చినప్పటినుండి ఒక పండుగగా వున్నబాబు, ప్రయాణమై వెళ్ళిపోతూ వుంటే? వీడ్కోలిచ్చే మా అందరికి ఎంతోబెంగ అనిపించింది. బాలికలు చాలమంది వచ్చారు. విడిచి పెట్టలేక మా బాలికలు విడిచి వెళ్ళలేక బాబు చాలా బాధ పడ్డారు. ఆదృశ్యం చూస్తూంటే నాకూ రామయ్య పంతులుకి కళ్ళనీళ్ళు తిరిగాయి, బస్సులోని ప్యాసింజర్లంతా విస్తుపోయి వింతను చూశారు.

బాబు ప్రతిచర్యను, ప్రతిమాటను జాగ్రత్తగాపరిశీలించి పుస్తకంలో వ్రాసుకున్నా. అతనికున్న అభిరుచులన్నీ పసిగట్ట గలిగాను. మేడలో నివసించే తనకి—నేలపై, పూరి గుడిసెల్లో బ్రతికే మా పిల్లలకీ మధ్య అంతరమే లేనట్లు భావించి మెలగిన బాబు పవిత్రవర్తనమే, పరిమళవర్తనమే అతని భావిజీవిత వికాసానికి వన్నెతెస్తుందని నాకు తట్టింది.

మరునటిదినం రాజుబాబు నాన్నగారిపేర ఒకఉత్తరం వ్రాశా. అందులో—బాబుకి ఉజ్వలమైన భవిష్యత్తున్నది. అతని విద్యాబుద్ధుల విషయంలో మీరు తీసుకున్న శ్రద్ధా సక్తులు మెచ్చుకోతగ్గవి. ముఖ్యంగా రామయ్యపంతులు వంటి గురువు మీ వత్సకు లభించడం ఒక వరము" అని వ్రాస్తూ.

రాజుబాబు మీకు మాకు
మోజుబాబు ముద్దు బాబు :

మింటి తార కట్టుల ప్రతి
కంటిలోన మెరసె బాబు,
పన్నీటితో దీపమ్మును
ప్రతి గుండెలో పెట్టెబాబు.
పగడాలతో మేలి ముగ్గు
ప్రతిముంగిట పెట్టె బాబు
మూగగుండె వీణలపై
రాగమ్మును పలికెను, అను
రాగమ్మును పలికె బాబు ॥

అని చిన్నపాటతో నా ఉత్తరం ముగించా. రాజుబాబు వాళ్ళవూరు వెళ్ళి, అక్కడనుంచి ఒకవుత్తరం ముద్దుగా మూడు ముక్కల్లో అక్కలందరికీ వ్రాశాడు. అందులో ధనలక్ష్మి అక్కను మరవకుండా పేర్కొన్నాడు. మా బాలికలు కూడా బాబుకి పెద్దవుత్తరం ఒకటి వ్రాశారు. నాటినుండి వుత్తరాలు రాజుబాబు, మాపిల్లల మధ్య సర సర నడుస్తున్నాడు.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

REPORT FOR JULY 1957

N-PATIENT MATERNITY

No. of Patients admitted for Deliveries	160
,, ,, Medical cases treated	87
,, ,, Surgical cases treated	
,, ,, Gyneac cases treated	39
,, ,, Post Natal	5
,, ,, babies admitted	119
Grand total	420
,, ,, normal Deliveries	112
,, ,, abnormal Deliveries	
forceps 9	-
Version 1	10
Total	122

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	72
,, ,, Medical cases	1082
,, ,, Gyneacoloagical case	162
,, ,, Ante-natal cases	246
,, ,, Post-natal cases	127
,, ,, E.E.N.T. cases	64
Total No. of New patients	1753
Total No. of Old patients.	*2864*
Grand Total	4617

NURSES' TRAINING CENTRE FOR AUXILIARY NURSE-MIDWIVES

At present there are 60 candidates undergoing training in the Andhra Mahila Sabha Nursing Home, Madras Out of these, 30 candidates belong to the III & IV batches and the remaining 30 candidates to the V batch. Fifth batch students are still undergoing trainining in the Government General Hospital. 7 girls of the IV batch are undergoing training in Women & Children Hospital Egmore from 1-6-57. Ten students of the III batch reported for duty for domiciliary midwifery at Nellore villages. Out of 17 candidates sent up for their first examination in Nursing & First aid, 14 candidates came out successful. A fresh batch ie. (VI batch) 30 candidates will be selected & their training will commence from 1st. of August 1957.

Mrs. V. LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs. A. C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANA BAI
Medical Superintendent.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు చలన చిత్ర వజ్రోత్సవం

గడచిన నెల, జూలై 28 వ తేదీన మద్రాసు సినిమా ప్రపంచంలో బ్రహ్మాండమైన ఉత్సాహమూ, ఆలజడీ కలిగింది. ఆ రోజు కోడంబాకం రోడ్డు పొడపోయే మోటారు కార్ల ప్రవాహానికి అంతూ పరీ లేదు. శ్రీ నాగిరెడ్డిగారి ఆవరణలో ఏర్పాటు కాబడ్డ షామియానా అలంకరణ ఆకర్షణీయమూ మనోహరమున్నూ. అక్కడ సమావేశమైన సినిమా తారలూ, నగరవాసులూ ధరించిన రంగు రంగుల దుస్తులు సభకు విచిత్రమైన శోభను సమకూర్చాయి. పేరెన్నికగన్న రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు సభకు విచ్చేశారు. కవులూ, కళాకారులూ, న్యాయవాదులూ, న్యాయమూర్తులూ, వణిక్ప్రముఖులూ, విద్యావేత్తలూ, పేరూ పాటూ ఎందుకు. అన్ని రంగాలలోని ప్రముఖులూ అక్కడ హాజరయ్యారు.



ఇంతటి కారణం శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు అరవై చిత్రాలలో నటించినందుకు ఉత్సవం జరుపుతూ ఉన్నందుకు. నాగేశ్వరరావు పేరు తెలియని మానవులు ఆంధ్రదేశంలోనే గాక, తమిళనాడులోనూ, పల్లెలలో నేమిటి, పట్నాల్లో ఏమిటి ఎక్కడా ఉండరు. స్త్రీ పురుషాదులందరికీ ఆయన ప్రేమపాత్రుడు. పదమూడు సంవత్సరాలలో అరవై చిత్రాల్లో నటించారు! అయితే మనదేశంలో అరవై చిత్రాల్లో కాదు నూరు అరవై చిత్రాల్లో నటించిన వారెందరో ఉన్నారు. ఉన్నప్పటికీ ఎక్కడా లేని ఈ మహోత్సవానికి కారణం ఏమిటి? నాగేశ్వరరావు నటుడేగాక మంచి మనిషి పేరు. తనను ఇంత గొప్పవాణ్ణిగా తయారుచేసిన నిర్మాతలకూ, గురువులకు తన కృతజ్ఞత తెలుపుకుంటూ దాని స్మృతి చిహ్నంగా వారికి షీల్డులు బహూకరించడమే కాకుండా ఆంధ్రా యూనివర్సిటీకి ఇరవై అయిదువేల రూపాయల నిధిని బీదవిద్యార్థులకు స్కాలరు షిప్పుల నిమిత్తం దానంచెయ్యడం ఇంకొక విశేషం. ఇంతకంటె ఎక్కువసొమ్ము దానాలుచేసినవారు ఉన్నారు. అయితే ఈ నాగేశ్వరరావుగారి ఉత్సవము ఇతర తారలకూ, ధనాధికులకూ ఉత్సాహం కలుగజేసి మార్గదర్శకం కాగలదనుట నిర్వివాదాంశము.

శ్రీ నాగేశ్వరరావు కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా కూడవల్లిగ్రామ నివాసి. చిన్నప్పటి నుంచీ నాటకాల్లో వేషాలు వేయడం అంటే సరదా. మొదట్లో ఆడవేషాలు వేసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఆయన అదృష్టం వల్లా, ప్రజల అదృష్టం వల్లా చిత్రసీమలో ఆయనకి ఏ మంచి ముహూర్తాననో ప్రవేశం లభించింది. రూపురేఖావిలాసాల వల్ల నైతేనేమి, ప్రతిభావిశేషాంవల్ల నైతేనేమి, సుగుణసంపత్తి వల్ల నైతేనేమి, జనసామాన్యంయొక్క హృదయాలను ఆకర్షించి, రంజింప జేసి నిరుపమానమైన స్థానం ఆక్రమించుకున్నారు. ఇప్పటికి అరవై చిత్రాలలో నటించారు. అందు విప్రనారాయణ, అర్ధాంగి, తెనాలి రామకృష్ణ అనే మూడు చిత్రాలు భారత దేశాధ్యక్షుని పతకాలను సంపాదించుకున్నవి. దేవదాసు చిత్రంలోని ఆయన నటనా కౌశలం ప్రజలను ముగ్ధులను చేసింది.

సంసారం, తోడికోడళ్లు, రోజులు మారాయి, [illegible] ముందర మొదలైన [illegible]

కున్నాయి. వయ్యారిభామ లాంటి ఏ కొద్ది చిత్రాలో తప్పిస్తే దాదాపు అన్ని చిత్రాలూ నిర్మాతలకు బాగానే డబ్బు సంపాదించాయి.

శ్రీ నాగేశ్వరరావు దేశంలోని యువకులకు ఆదర్శ పురుషుడు. అందరూ ఆయనలా తయారు కావాలని వాంఛిస్తూ ఉంటారు. చిత్రాల్లో నటించడం తేలికపనికాదు. నటన, కళా కౌశలం మొదలైనవే కాక చలన చిత్ర నటుడికి ఆరోగ్యం కూడా బాగా ఉండాలి. శారీరకంగా ఎన్నో కష్టాలు పడతారు. సరియైన వేళకు నిద్రా, విశ్రాంతి దొరకవు. తిండి తిప్పలూ ఉండవు. గంటల తరబడి నిలబడో, కూర్చునో ఉండాలి. ప్రమాదకరమైన పనులు చేయాలి అన్నిటికీమించి చిత్రం తీసేటప్పుడు చేసిందే చేసి, అన్నమాటే అని, ఇతరుల పొరపాట్లకి తాము కూడా శిక్ష అనుభవిస్తూ ప్రాణం, విసుగెత్తిపోతుంది. ఇన్నిపాట్లూ పడి ప్రజలకు సంతోషాన్ని కలగ జేస్తున్నారన్నమాట. కోట్లకొలది ప్రజానీకాన్ని శ్రీ నాగేశ్వరరావు సంతోష పరచిన దానిలో ఈ దానం ఏపాటిది?

ఆయనకు ఆరోగ్యం బాగా ఉండాలనీ, తారుణ్యం సడలకూడదనీ, ఇంకా ఎన్నో చిత్రాల్లో నటించాలనీ, త్వరలోనే నూరు చిత్రాలూ పూర్తిచేసి ఇంకా పెద్దదానం చేసి బీద ప్రజానీకానికి సహాయం చేయాలనీ ఆశిస్తూ, చలన చిత్రవజ్రోత్సవ సందర్భమున శ్రీ నాగేశ్వరరావును ఆంధ్ర మహిళ అభినందిస్తూ ఉంది.

శ్రీ కందుకూరి వీరేశలింగ మహిళా సముద్ధరణాలయము

స్త్రీలకు విద్యాభ్యసనావకాశములనిచ్చి గౌరవ జీవనానికి అనువైన భృతిని కల్పించే నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారి పేరిట స్థాపించబడిన శరణాలయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సభకు సహకార శాఖామంత్రి శ్రీ డి. సంజీవయ్య అధ్యక్షత వహించారు.

ముఖ్యమంత్రి ఉపన్యాసంలో "చదువుకొని, ఎన్నో యోగ్యతలు గల బాలికలకుకూడా పెళ్ళి చెయ్యడం ఈ రోజులలో గడ్డు సమస్య అయింది. కట్నాల పిశాచం తీవ్ర రూపం దాల్చింది. దీనిని నిర్మూలించడానికి ప్రబలమైన ఉద్యమం ప్రారంభించడం అవసరంగా కనబడుతున్నది. ఇట్టి ఉద్యమం ప్రారంభించడానికి రాజమహేంద్రవరంకంటే అనువైన పట్టణం మరి లేదు. స్త్రీ పునర్వివాహం వంటి పెద్ద ఉద్యమాలే జయప్రదంగా జరిగిన ప్రాంతమిది" అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ సలహా సమితి అధ్యక్షురాలు శ్రీమతి అన్నాప్రగడ చన్నమ్మ కృష్ణారావు మాట్లాడుతూ "వినూత్నమైన దృక్పథముతో, విశాలమైన సేవాభిలాషతో, సంఘ విధానాలలో చారిత్రాత్మకమైన సంస్కరణలను రూపొందించి, అస్పృశ్యులకు, అనాధస్త్రీలకు ఆప్తబంధువులై, నవీనాంధ్రయుగ నిర్మాతగా, గురుదేవులుగా ఆంధ్రుల హృదయములలో పవిత్రమైన స్థానము ఆక్రమించియున్న రావుబహదూరు శ్రీ కందుకూరి వీరేశలింగముగారిచే స్థాపింపబడిన వితంతు శరణాలయము, యీనాడు ప్రభుత్వ ఆధ్వర్యముతో, రాష్ట్రస్థాయిలో, అనాథ స్త్రీలకు పెద్దయెత్తున పునరావాసము కలిగించే కార్యరంగముగా రూపొందుతూ వుంది.

"స్త్రీల పునరావాసానికి రాష్ట్ర స్థాయిని 80 సంస్థలు, జిల్లాల స్థాయిని 330 రక్షణాలయాలు 16 రాష్ట్రాలలో నెలకొల్పే నిమిత్తం ఇండియా ప్రభుత్వం 10 కోట్ల 66 లక్షల రూపాయలు కేటాయించ బడినవి. వీటిలో ఆంధ్రకు 1957-58 సంవత్సరానికి రాష్ట్రస్థాయిని అయిదు శరణాలయాలు, జిల్లాల స్థాయిని 20 రక్షణాలయాలు మంజూరు చెయ్యబడినవి. ఈ స్కీములకు ప్లానింగ్ కమిషన్ ఆంధ్ర ప్రాంతానికి 12 లక్షల 66 వేల రూపాయలు, తెలంగాణాకు 7 లక్షల 73 వేల రూ॥లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా యింత మొత్తాలు రెండవ ప్రణాళికలో కేటాయించింది. ఈ సంస్థలన్నీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో నడుపబడగలవు.

"ఈనాడు ప్రారంభింపబడుచున్న యీ సంస్థ అనాథ శరణాలయములు, వితంతు శరణాలయములు. యితర పాఠశాలలు, సేవాసంస్థలనుండి విడుదలయైన యువతుల పునరావాసమునకై కృషిచేయగలదు. ఇందు ప్రవేశమిచ్చిన యువతులను, కొంత చదివినవారైన గుమాస్తాలుగా, టైపు షార్టుహాండులలోనూ, పద్దులు వ్రాయడంలోనూ, తర్ఫీదు పొందుటకు, తక్కువ చదివినవారైన మంత్రసానులుగా, వృత్తి, విద్యా అధ్యాపకులుగా తర్ఫీదు పొందుటకు ఏర్పాట్లు చేయబడును. ప్రభుత్వ విద్యాశాఖ, వృత్తి పునరావాసశాఖ, ఆరోగ్యశాఖల సహకారముతో యీ శిక్షణలు జరుగును. ఇట్టి అవకాశములను పొందుటకు తగినవిద్యలేని యువతుల ఉపయోగార్థము ప్రభుత్వ పరిశ్రమల శాఖలతో సంప్రదించి, ఒక లఘు పరిశ్రమకు సంబంధించిన శిక్షణ, ఉత్పత్తి శాఖలు ఇచట ఏర్పాటు గావింపబడును. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దీనికి తగిన సాధారణ అనుమతి లభించినది. ఈ ఉత్పత్తి కేంద్రములో 500 మంది యువతులకు వృత్తిలభించే ఏర్పాట్లు చేయబడును.

"రాజమండ్రి హితకారిణి సమాజమువారు అతి ఔదార్యముతో, శ్రీ వీరేశలింగముగారు సమాజమువారికి

దత్తముచేసిన ఆస్తిలో, రమారమి 17 ఎకరములభూమి, అందుగల భవనముతో సహా 25 సంవత్సరములపాటు రాష్ట్ర ప్రభుత్వమునకు యీ కార్యక్రమ నిర్వహణకై సంవత్సరమునకు 10 రూపాయిలు మాత్రము అద్దె నిశ్చయించి యిచ్చుటకై ముందంజ వేసి ప్రభుత్వ భాధ్యతను కొంతవరకు తగ్గించినారు. అదియుగాక వృత్తి పునరావాస శాఖవారిచే నడుపబడు వృత్తివిద్యా శిక్షణ యీ సంస్థ బాలికలకు లభించునిమిత్తము ఆ ఆవరణలో విశాలమైన షెడ్సు కట్టించి యిచ్చుటకు పూనుకొనినారు. అదియునుగాక ప్రస్తుతము వారు నడుపుచున్న కుట్టు, యంబ్రాయిడరీ, నూలు వడుకు తరగతులుకూడా యీ సంస్థలోని యువతులు ఉపయోగించుకోగల సదుపాయము చేయుటకు అంగీకరించినారు.

"ఈ శరణాలయము చిరస్థాయిగా రాష్ట్రం మొత్తం మీద అనాథ స్త్రీలకు ఆవాసస్థలముగా పునర్నిర్మాణము కావాలి అని నేనున్నూ, కుమారి జమునాబాయియున్నూ చాలా కాలంగా వాంఛిస్తున్నాము. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మా వాంఛకు దోహదమిచ్చారు. ఈ సంస్థ అనాథ స్త్రీల పాలిటిపెన్నిధియై తన సేవా కార్యక్రమమును నిరాఘాటముగ జరుప గలదని ఆశించుచున్నాను" అని చెప్పారు.
